ఈనాడు
ఏలూరు
గురువారం సెప్టెంబరు 26, 2024




**ఈనాడు, ఏలూరు, జంగారెడ్డిగూడెం పట్టణం:**


అడవే కదా.. అడిగేదెవరు.. అడ్డుకునేదెవరూ అన్నట్లు ఉంది అక్రమార్కుల తీరు. జిల్లాలో అడవుల నరికివేత యథేచ్ఛగా సాగుతోంది. చెక్‌పోస్టులున్నా.. సిబ్బంది విధుల్లో ఉన్నా..వేలాది చెట్లు అడ్డగోలుగా నరికేస్తున్నారు. అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

# అడవే కదా.. అడిగేదెవరని..

**పొగాకు బ్యారన్‌లే ఆదాయ వనరులు..** నరికిన కలపను ఎక్కువగా పొగాకు బ్యారన్‌లకు తరలిస్తున్నారు. ఇందులో జీడిమామిడి, జామాయిల్, నిద్రగన్నేరు వంటి చెట్లు ఎక్కువగా రవాణా చేస్తున్నారు. ఒక బ్యారన్‌లో పొగాకు ఉడికించేందుకు దాదాపు 25 టన్నుల కలప అవసరం ఉంటుంది. దీంతో గోపాలపురం, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి మండలాలకు భారీగా రవాణా జరుగుతోంది.

☛ ఈ చిత్రంలో కనిపిస్తున్న కలప ట్రాక్టర్ జంగారెడ్డిగూడెం పొగాకు బ్యారన్‌కు కలప తీసుకొచ్చింది. వేలేరుపాడు మండలం గుళ్లమడుగు, సిద్ధారం పరిధిలోని అడవిలో అక్రమ కలప రవాణా జోరుగా సాగుతోంది. పెద్దపెద్ద చెట్లను రాత్రుళ్లు నరికి ఇలా వాహనాల్లో ఎక్కిస్తున్నారు. వీటిని జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, గోపాలపురంలోని పొగాకు బ్యారన్‌లకు తరలిస్తున్నారు.

☛ ఇది జంగారెడ్డిగూడెంలోని ఓ పొగాకు బ్యారెన్‌లోని కలప. ఈ నిర్వాహకుడు తరచూ వేలేరుపాడు మండలంలోని అడవుల నుంచి రాత్రుళ్లు కలప తీసుకొస్తున్నారు. గత అయిదేళ్ల నుంచి స్థానికంగా ఓ వైకాపా నాయకుడి అనుచరుడి ద్వారానే రవాణా జరుగుతోంది. ప్రభుత్వం మారినా అటవీశాఖ అధికారుల తీరు మారకపోవటంతో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.




☛ కుక్కునూరు మండలం వెంకటాపురం, సీతారామనగరంలోని అటవీ ప్రాంతంలో యథేచ్ఛగా చెట్లు నరికేస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులోని కావిడిగుడ్లలోనూ పరిసరాల్లోనూ ఇదే తంతు. భారీ వాహనాల్లో ఎక్కించి తెలంగాణ రాష్ట్రానికి తరలించి టన్ను రూ.3 వేల వరకు సొమ్ము చేసుకుంటున్నారు.

**అడ్డగోలుగా..** ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష హెక్టార్ల వరకు అటవీ భూమి ఉంది. క్షేత్రస్థాయిలో చూస్తే అడవులను అడ్డగోలు నరికేస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, టి.నరసాపురం, చింతలపూడి మండలాల పరిధిలో దాదాపు అన్నిచోట్ల చెట్లు నరికి, దుంగలను వాహనాల్లో తరలిస్తున్నారు. టన్నుకు రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం ఆయా ప్రాంతాల్లో మండల స్థాయి నాయకుల కనుసన్నల్లోనే జరుగుతోంది. గత అయిదేళ్లలో 15 వేల ఎకరాలకు పైనే అడవులను నరికి తరలించేశారు.

**నెలవారీ మామూళ్ల కోసం..** ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మన్యంలో 5 వరకు తనిఖీ కేంద్రాలున్నాయి. వంద మందికి పైగా సిబ్బంది గస్తీ కాస్తుంటారు. అయినా కలప నిరాటంకంగా తరలిపోతోంది. అటవీ శాఖలో కొందరు అధికారులు, కింది స్థాయి సిబ్బంది నెలవారీ మామూళ్లు మాట్లాడుకుని వాహనాలను వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా కలప వాహనాలపై ఫిర్యాదు చేసినా.. అవి పట్టా భూముల్లో నరికినవే అంటూ బుకాయిస్తున్నారు. ఈ అంశమై కలెక్టర్ వెట్రిసెల్విని వివరణ కోరగా అడవుల నరికివేతను అరికడతామని, చెక్‌పోస్టులు బలోపేతం చేసేలా అధికారులకు ఆదేశాలిస్తామని తెలిపారు.

## పచ్చని కొండల్లో.. చల్లని దేవుడు..!



నరసింహుని పుణ్యక్షేత్రాల్లో ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నృసింహస్వామి ఆలయం ఒకటి. లక్ష్మీనరసింహస్వామి వ్యాఘ్రరూపంలో శోభనగిరిపై వెలిశారని, అందుకే స్వామివారికి ఈ పేరు సార్థకమైనట్లు చరిత్ర చెబుతోంది. సుమారు 750 మెట్లు కలిగి ఉండే శోభనగిరి శిఖర భాగాన మల్లికార్జునస్వామిగా శివుడు, దిగువన వ్యాఘ్రలక్ష్మీనృసింహస్వామిగా విష్ణుమూర్తి కొలువైన ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండంతా పచ్చని చెట్లతో కళకళలాడుతోంది. కిలోమీటరు దూరం నుంచి ఎటుచూసినా పచ్చనికొండల్లో కొలువైన స్వామివారి ఆలయం దర్శనమిస్తోంది.

- ఈనాడు, ఏలూరు

## సహకార సంఘాల పురోగతికి కృషి

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** సహకార సంఘాల పురోగతికి పర్సన్ ఇన్‌చార్జులు కృషి చేయాలని డీసీసీబీ ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్, సంయుక్త కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి సూచించారు. స్థానిక డీసీసీబీ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభ నిర్వహించారు. తొలుత 2023-24 ఆడిట్ నివేదికను ఆమోదించారు. ఆప్కాబ్ ఈ బ్యాంకు ఆర్థిక పరిస్థితులపై సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ... సీఆర్ఏఆర్ శాతాన్ని పెంచడానికి, షేర్ క్యాపిటల్‌ను బ్యాంకులో మదుపు చేయాలన్నారు. అక్టోబరు 7 నుంచి ధాన్యం కొనుగోలు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డీసీవో ఎ.శ్రీనివాస్, బ్యాంకు సీఈవో నారా తిలక్, భీమవరం డీఆర్ కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు 7 పశ్చిమ 6

☛ పూర్వ విధానంలోనే ఆబ్కారీ స్టేషన్లు
☛ బదిలీల ప్రక్రియ కొలిక్కి

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** నూతన విధానంలో భాగంగా ఎస్ఈబీ స్థానంలో ఆబ్కారీ శాఖను పునర్ వ్యవస్థీకరించారు. డిస్టిలరీలతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పరిపాలన విభాగం, తనిఖీ కేంద్రాలకు సిబ్బందిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2020కు ముందున్న ఎక్సైజ్‌శాఖ స్వరూపాన్ని ఇప్పుడు పునరుద్ధరించారు. పర్యవేక్షణ, నియంత్రణ, పరిపాలన బాధ్యతలను ఎక్సైజ్ కమిషనర్‌కు అప్పగించారు.



**ఉప కమిషనర్ నియామకం..** ప్రస్తుతం కర్నూలులో పనిచేస్తున్న బి.శ్రీలతను ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు కలిపి ఉప కమిషనర్‌గా నియమించారు. అదనపు కమిషనర్‌గా భీమవరంలో ఇదే హోదాలో పనిచేస్తున్న కేవీ నాగప్రభుకుమార్‌ను నియమించారు. ఏలూరు డీపీఈవో కేటీ కుమారేశ్వరన్‌ను భీమవరానికి, కృష్ణా జిల్లా డీపీఈవో ఎ.ఆవులయ్యను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. ● గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఉన్నట్లుగానే పాత విధానంలోకి ఆబ్కారీ స్టేషన్లు వచ్చాయి. ఏలూరు జిల్లాకు 7, పశ్చిమగోదావరి జిల్లాకు 6 చొప్పున స్టేషన్లు ఉన్నాయి. మద్యం డిపోలను గతంలో ఉన్నట్లుగానే కేటాయించారు.

**నిండుకున్న మద్యం నిల్వలు..** నూతన విధానంలో భాగంగా అక్టోబరు 1 నుంచి కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటుకు ప్రభుత్వ రంగం సిద్ధం చేస్తోంది. దుకాణాల కేటాయింపు, రుసుములపై ఉత్తర్వులు ఒకటి రెండు రోజుల్లో వెలువడవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ దుకాణాల్లో చాలా చోట్ల సరకు నిల్వలు చివరి దశకు చేరినట్లు సమాచారం. దీంతో కొన్ని చోట్ల మద్యం లేదంటూ బోర్డులు పెట్టారు.

## బాధ్యతల స్వీకరణ

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్గా కె.వి.ప్రభుకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన్ను ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది అభినందించారు. ★ ఏలూరు జిల్లా ఎక్సైజ్ అధికారిగా ఆవులయ్య బుధవారం తన ఛాంబరులో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.


నాగప్రభుకుమార్, ఆవులయ్య

## గంజాయి మూలాలపై ప్రత్యేక దృష్టి

**పోలవరం, న్యూస్‌టుడే:** గంజాయి కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు పట్టుబడుతున్నారని, వారి మూలాలపై దృష్టి పెట్టామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలవరం డీఎస్పీ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం సబ్‌డివిజన్ పరిధిలో పోక్సో కేసులు, కొయ్యలగూడెం-జీలుగుమిల్లి జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్నట్లు గుర్తించామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారన్నారు. ఎవరైనా నగదు పోగొట్టుకుంటే మూడు గంటల్లో ట్రోల్‌ఫీ నంబరు 1930కి లేదా సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పరిణామాల నేపథ్యంలో మావోయిస్టులు పాపికొండల అభయారణ్యంలో ప్రవేశించే అవకాశం ఉందా అని విలేకరులు ప్రశ్నించగా.. అక్కడి పరిణామాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించడంతోపాటు కుక్కునూరు, వేలేరుపాడు మండలాలపై నిఘా ఉంచామన్నారు. ఆయా స్టేషన్లలో ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. అనంతరం ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్‌తో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. పోలవరం పోలీస్‌స్టేషన్‌తోపాటు నూతన భవన నిర్మాణాన్ని ఐజీ పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐలు తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

## చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తాం: మంత్రి

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి నూజివీడు నియోజకవర్గ ప్రజల కల సాకారం చేస్తామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం నూజివీడు మండలం సీతారామపురం, పల్లెర్లమూడి, మీర్జాపురం గ్రామాల్లో రూ.170.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మూలన పడిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసి నియోజకవర్గ ప్రజలు, రైతులకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని రంగాలను విచ్ఛిన్నం చేసిందని ఆరోపించారు.



పల్లెర్లమూడిలో మాట్లాడుతున్న పార్థసారథి

## 15 శాతం వృద్ధి సాధిద్దాం

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** స్వర్ణాంధ్ర-2047లో భాగంగా రానున్న అయిదేళ్లలో 15 శాతం వృద్ధి సాధనకు జిల్లా ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రణాళిక రూపకల్పనపై బుధవారం వివిధ వర్గాల నుంచి సూచనలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ... జిల్లాలో అనేక ఆర్థిక వనరులున్నాయని, వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర ప్రోత్సాహకాలకు సంబంధించి సమస్యలుంటే పరిష్కరిస్తామన్నారు. జిల్లా అభివృద్ధి 60 శాతానికి పైగా వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత రంగాలపై ఆధారపడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


వెట్రిసెల్వి

## కనీస సౌకర్యాలు కల్పించాలి

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** మహిళలు పని చేసే కార్యాలయాల్లో వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ సూచించారు. స్థానిక న్యాయస్థాన ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగినులతో బుధవారం సమావేశమై మాట్లాడారు. కార్యాలయాల్లో సహచర ఉద్యోగుల కారణంగా ఎదురయ్యే సమస్యలు అధిగమించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరికైనా సమస్య ఏర్పడితే ధైర్యంగా కమిటీకి చెప్పాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని ఆయన భరోసానిచ్చారు. సమావేశంలో మూడో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి మహ్మద్ అబూతాలీబ్ పర్వీజ్ షేక్, సీనియర్ న్యాయవాది కె కృష్ణారావు, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాతున్న రత్నప్రసాద్

# రైతు వ్యథ వినేందుకు పద!

**పాలకొల్లు, టి.నరసాపురం, న్యూస్‌టుడే:** గత వైకాపా ప్రభుత్వ పాలనలో రైతులకు రాయితీపై పరికరాల పంపిణీ ఎత్తేశారు. వరిలో ముడి జింకు నుంచి నారుకు విత్తనాల వరకు సరఫరా ఆపేశారు. భూసార పరీక్షలు మానేశారు. చివరికి పండించిన పంటను అమ్ముకోవడానికి స్వేచ్ఛ లేకుండా చేసేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయంపై దృష్టి సారించింది. అన్నదాతలకు ఆసరాగా నిలవడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, సేంద్రియ, మార్కెటింగ్‌శాఖ అధికారుల బృందాన్ని పొలం గట్టుకే పంపిస్తోంది. 'పొలం పిలుస్తోంది' పేరిట ప్రతి మంగళ, బుధవారాల్లో అధికార యంత్రాంగం రైతుల దగ్గరకే వెళ్లేలా రూపొందించిన కార్యక్రమం ఈ నెల 24న ఉమ్మడి జిల్లాలో ఆరంభమైంది.


టి.నరసాపురం మండలం బండివారిగూడెంలో..



12 లక్షలు మొత్తం రైతులు

వారానికి 2 రోజులు క్షేత్రంలో అధికారులు ● అధిక దిగుబడుల సాధనకు ఆసరా

**సత్ఫలితాల సాధనకు..** వాతావరణం అనుకూలించక అన్నదాతలకు సాగు భారంగా మారింది. ఈ క్రమంలో రైతులను నూతన విధానాల వైపు మళ్లించి సాగు వ్యయం తగ్గించి ఆశించిన ఫలితాలను సాధించడమే 'పొలం పిలుస్తోంది' లక్ష్యం. ఇందు కోసం ప్రాంతాల వారీగా అవసరమైన సూచనలు చేయడం, భూసార పరీక్షలు నిర్వహించేలా ప్రోత్సహించడం ఆయా శాఖల అధికారులు చేయాల్సి ఉంది. ఎరువుల పిచికారికి కిసాన్ డ్రోన్లను వినియోగించడం, కౌలు రైతుకార్డులు మంజూరు, రైతుమిత్ర సంఘాల ఏర్పాటు వంటి విషయాలపై రైతులను చైతన్య పరుస్తారు. ఖరీఫ్, రబీ పంట కాలంలో నాలుగు నెలల పాటు జరిగే ఈ కార్యక్రమం ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు ఉమ్మడి జిల్లాలోని 48 మండలాల్లో కొనసాగనుంది.

**నిధుల కేటాయింపు..** 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. దీనిపై పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయశాఖ జేడీ వెంకటేశ్వరరావును సంప్రదించగా మండలాల వారీగా బడ్జెట్ కేటాయింపు ఉంటుందన్నారు. అవసరం మేరకు చేసిన వ్యయానికి ఆయా మండలాల అధికారులు బిల్లులు పెట్టుకోవాలని చెప్పారు.

# కొవ్వాడ కాలువలో ఇసుక దందా..!




జేసీబీలతో తవ్వకాలు
ఆందోళనలో ఆయకట్టు రైతులు
స్థానిక నాయకుల సహకారంతో..

**పోలవరం, న్యూస్‌టుడే**

కొవ్వాడ కాలువ పరిధిలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. జేసీబీలతో తవ్వి పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో సమీప తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలానికి తెల్లవార్లు తరలిస్తున్నారు. దీంతో పోలవరం మండలం పట్టిసీమకు చెందిన 600 ఎకరాల ఆయకట్టు పరిధిలోని వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో పాటు కోతకు గురైన చోట్ల అయిదేళ్ల కిందట తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పంటలను తలచుకుంటూ దిగులు చెందుతున్నారు. కాలువ గట్టు తెగితే దిగువన ఉన్న తాళ్లపూడి, కొవ్వూరు, నిడదవోలు, చాగల్లు, తాడేపల్లిగూడెం మండలాలకు కూడా ముంపు పొంచి ఉంది.

ఇసుకకు ఉన్న డిమాండ్ దృష్ట్యా పక్క జిల్లాకు చెందిన కొందరితో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నాయకులు చేతులు కలిపి పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం కురుస్తున్న వర్షాల కారణంగా కాలువలో నీటి ప్రవాహం ఉద్ధృతంగా కొనసాగుతున్నప్పటికీ తవ్వకాలు నిరాటకంగా సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై కొవ్వాడ జలాశయ పర్యవేక్షణ ఇన్‌ఛార్జి డీఈ రాంబాబు మాట్లాడుతూ తమకు ఉన్న ఒక లాస్కర్ కొవ్వాడ జలాశయం పనులతో పాటు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ పనులు చూడాల్సి ఉందన్నారు. వెంటనే ఏఈని పంపి కాలువను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రూ. కోటి జీతం.. అయినా వద్దనుకున్నా!!
సమాజ ఉషస్సు!
6లో
పలు రైళ్లు పాక్షికంగా రద్దు, దారి మళ్లింపు

☛ తణుకు మండలం తేతలి సమీపంలోని ఓ చేపల చెరువులో గతంలో కోళ్ల వ్యర్థాలను ఉడకబెట్టి మేతగా వేసేవారు. సమీప రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో విరమించారు. అయితే స్థానిక మాంసం దుకాణాల నుంచి పెద్ద ఎత్తున మాంసం వ్యర్థాలను బయటకు తరలిస్తున్నారు.

మాంసం విక్రయ దుకాణాలు సుమారు 1650

☛ గతేడాది ఫిబ్రవరిలో కోడిమాంసం వ్యర్థాలు హైదరాబాద్ నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు తరలిస్తున్న నాలుగు వాహనాలను యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు.

# కోళ్ల వ్యర్థం.. కనరే అనర్థం!

☛ చేపల చెరువుల్లో మేతగా వినియోగం ☛ దొంగచాటుగా తరలిస్తున్న దళారులు

**ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:**

ఉమ్మడి జిల్లాలో సుమారు 1650 వరకు మాంసం విక్రయ దుకాణాలున్నాయి. చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు తరలించేందుకు కొందరు దుకాణదారులతో ఒప్పందం చేసుకుని, రెండు మూడురోజులకోసారి వ్యానుల్లో వ్యర్థాలు తరలిస్తున్నారు. దీని కోసం ముందస్తు అడ్వాన్స్‌లు సైతం చెల్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులకు మేతగా వేయడాన్ని నిషేధించింది. చెరువుల్లో కోడి వ్యర్థాలు ఉపయోగిస్తే ప్రజారోగ్యం దెబ్బతింటోందని వైద్య నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. అయినా కొంతమంది మానడం లేదు. పెదపాడు, ఏలూరు గ్రామీణ, పెదవేగి, భీమడోలు, కైకలూరు, ఉంగుటూరు, నిడమర్రు, భీమవరం, ఆకివీడు మండలాల్లో చాపకింద నీరులా ఈ వ్యాపారం సాగుతోంది.


తణుకులో ఓ దుకాణం నుంచి డ్రమ్ముల్లో తరలిస్తున్న కోళ్ల వ్యర్థాలు

**ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ..** చేపలకు మేతగా వేసే డీవోబీ (నూనె తీసిన తవుడు), వేరుశెనగ చెక్క ధర ఎక్కువ. ఆరు నెలలకు సగటున ఎకరాకు రూ.3 లక్షల వరకు ఖర్చవుతుంది. మాంసం వ్యర్థాలను మేతగా వేస్తే అది రూ.లక్షలోపే అవుతుంది. సంప్రదాయ చేపల మేత కిలో రూ.35 ధర ఉండగా, చికెన్ వ్యర్థాలు రూ.10కే దొరుకుతున్నాయి. ఒక ఎకరా చేపల చెరువుకు సంప్రదాయ మేత రోజుకు 20 కిలోలకు రూ.700 అవుతుంది. కూలి మరో రూ.200 అదనం. నెలకొచ్చేసరికి సుమారు రూ.25 వేలు అవుతుంది. అదే కోళ్ల వ్యర్థాలు 200 కిలోల డ్రమ్ము సుమారు రూ.2 వేలకే వచ్చేస్తుంది. నెలకు రూ.12 వేల నుంచి రూ.14 వేలే ఖర్చవుతుంది.

**ఆదాయం కూడా..** సాధారణంగా మాంస వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించాలి. కానీ ఆ వ్యర్థాలను సైతం కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. దళారులు మాంసం దుకాణాల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఇది ఆదాయ మార్గంగా మారడంతో వారి మధ్య పోటీ ఎక్కువైంది. దుకాణ యజమానికి నెలకు రూ.6 వేల వరకు చెల్లిస్తున్నారు. వీటిని రూ.16వేల నుంచి రూ.20వేల వరకు విక్రయిస్తున్నారు. ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ కావడంతో వ్యర్థాలు మాకే ఇవ్వాలంటూ ముందస్తుగా రూ.25 వేల వరకు అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రంలో దళారుల మధ్య పోటీ నెలకొనడంతో సమస్య పరిష్కారానికి ఓ ప్రజాప్రతినిధిని ఆశ్రయించారని తెలిసింది. 'కొల్లేరు పరిసర ప్రాంతాల్లో రైతులకు సరఫరా చేసే అవకాశం ఉంది. తనిఖీ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని మత్స్యశాఖ జేడీ ప్రసాద్ తెలిపారు.

## ముసునూరులో అత్యధిక వర్షపాతం

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** జిల్లాలో మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల మధ్య 18.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైందని ఇన్‌ఛార్జి సీపీవో బి.శ్రీదేవి తెలిపారు. ముసునూరులో అత్యధికంగా 88.4, కుక్కునూరులో అత్యల్పంగా 0.2 మి.మీ. వర్షం కురిసిందని చెప్పారు.

## అధరగొట్టిన కట్ల!




ఆకివీడులో టోకు చేపల మార్కెట్‌కు బుధవారం భారీ చేపలు వచ్చాయి. తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన ఓ రైతు కట్ల జాతి చేపలను ఈ మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఒక్కోటి 8 నుంచి 14 కిలోల వరకు బరువుండటంతో ఓ వ్యాపారి మొత్తం చేపలను కిలో రూ. 270 చొప్పున కొనుగోలు చేసి పశ్చిమబెంగాల్‌కు ఎగుమతి చేశారు. ఈ జాతి చేపలు సాధారణంగా 2 నుంచి 3 కిలోల వరకు పెరుగుతాయి. ధర కిలో రూ.130-150 వరకు పలుకుతుంది. 10 కిలోలకు పైగా బరువున్న చేపలు అరుదుగా వస్తుంటాయని.. అందుకే దాదాపు రెట్టింపు ధర దక్కిందని స్థానిక వ్యాపారులు చెప్పారు.- **న్యూస్‌టుడే, ఆకివీడు**

## మహోన్నత నేత దీన్‌దయాళ్



వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** సమాజంలో చిట్టచివరి వ్యక్తికీ స్వాతంత్ర్య ఫలాలు అందాలని, అందుకు నిరంతరం పరితపించిన మహోన్నత వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు(ఉంగుటూరు), బొలిశెట్టి శ్రీనివాస్(తాడేపల్లిగూడెం), ఆరిమిల్లి రాధాకృష్ణ(తణుకు), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(అనపర్తి) కొనియాడారు. స్థానిక గ్రీన్ ఆసియా ఇంపెక్స్ పరిశ్రమలో భారతీయ జన్‌సంఘ్ సహ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పరిశ్రమ సీఎస్ఆర్ నిధులు, దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో 110 మందికి వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, సర్పంచి బండారు సింధు, భాజపా శాసనసభ కన్వీనర్ శరణాల మాలతీరాణి, పరిశ్రమ అధినేత పసుపులేటి వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మెస్ నిర్వాహకులకు నోటీసులు



వంటలను పరిశీలిస్తున్న పరిపాలన అధికారి, విద్యార్థులు

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** నూజివీడు ట్రిపుల్ ఐటీ మెస్‌లో భోజనం నాణ్యత లోపించడంతో మెస్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు ఇన్‌ఛార్జి డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి విద్యార్థులకు వడ్డించిన సాంబారు తయారీలో లోపం జరిగిందన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నిత్యం పర్యవేక్షణ కోసం కళాశాల పరిపాలన అధికారి లక్ష్మణరావు, విద్యార్థుల భాగస్వామ్యంతో బృందం ఏర్పాటు చేశామన్నారు. రోజూ విద్యార్థులు మెనూ భోజనం తయారీ, నిత్యావసర సరకుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించి ధ్రువీకరిస్తారన్నారు. వంట, నిత్యావసర వస్తువుల పరిశీలనకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయి అధికారులు, ప్రభుత్వానికి నివేదిస్తున్నామన్నారు. పరిపాలన అధికారి లక్ష్మణరావు, సురేష్ పాల్గొన్నారు.

## టీటీసీ పరీక్షల తేదీల్లో మార్పు

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్(టీటీసీ) కోర్సుల్లో డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, వీవింగ్ లోయర్ గ్రేడ్ పరీక్ష తేదీల్లో మార్పులు చేసినట్లు డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. ఆయా విభాగాల్లో అనుత్తీర్ణులైన అభ్యర్థులకు ప్రస్తుతం పరీక్షలు జరగాల్సి ఉండగా... దాన్ని 27వ తేదీకి మార్చామని చెప్పారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో పరీక్షలుంటాయన్నారు. త్వరలోనే www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు పొందుపరుస్తారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** డిసెంబరు 8న నిర్వహించనున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు గడువును అక్టోబరు 3వ తేదీ వరకు పెంచినట్లు డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, పురపాలక, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## ముఖాముఖి

# రూ. కోటి జీతం... అయినా వద్దనుకున్నా!!

ఈనాడు, విశాఖపట్నం



జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి సవాళ్లను అధిగమించాలి. ఈ క్రమంలో 'రిస్క్' కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా సివిల్స్ సాధన చేసేవారికి ఒక రకమైన మొండి పట్టుదల ఉండాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చు. ఉన్నంతలో సర్దుకుపోదాం అంటే ఎప్పటికీ మన కలలను నిజం చేసుకోలేం' అని ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ చెబుతున్నారు.

రిస్క్ తీసుకొని సివిల్స్ వైపు వచ్చా

రోజుకు 14 గంటలు కష్టపడ్డా.. ఫలితంగానే 24వ ర్యాంకు

శ్రద్ధ చూపితే మొదటి ప్రయత్నంలోనే విజయం సాధ్యం

'ఈనాడు'తో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

ఈ యువ ఐఏఎస్ అధికారి సమయం చిక్కినప్పుడల్లా 'కెరీర్ గైడెన్స్' కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి సృజనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించేలా 'హ్యాక్ ఏపీ హ్యాకథాన్' కార్యక్రమాన్ని చేపట్టారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'అదర్ కెరీర్ ఆప్షన్స్' అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వచ్చాయి. మరిన్ని రాబోతున్నాయి. ప్రతి ఒక్కరూ కఠోర దీక్షగా శ్రమిస్తే ఆశించిన ఫలితం అందుకోవచ్చంటున్న పృథ్వీతేజ్... తాను ఐఏఎస్ సాధించిన తీరు, స్వీయ అనుభవాలను 'ఈనాడు'తో పంచుకున్నారు.

**విద్యార్థి దశ నుంచే బలమైన కోరిక:** 'మాది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ద్వారకా తిరుమల గ్రామం. మా నాన్న మొదట్లో కిరాణా దుకాణం నిర్వహించేవారు. తర్వాత చిన్న బంగారు ఆభరణాల దుకాణం నడుపుతున్నారు. నేను ఆరో తరగతి వరకు స్థానికంగానే చదువుకున్నా. ఏడో తరగతి నుంచి పదోతరగతి వరకు గుడివాడలో స్కూల్ హాస్టల్‌లో ఉండే చదువుకున్నా. అప్పుడే నాలో ఐఏఎస్ అవ్వాలనే కోరిక కలిగింది. 2011లో ఐఐటీ ప్రవేశ పరీక్ష రాసి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించినప్పుడు ఆ కోరిక మరింత బలపడింది.

● ముంబై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా. 2014 ప్రాంగణ ఎంపికల్లో సామ్‌సంగ్ కంపెనీలో ఉన్నత కొలువే దక్కింది. దక్షిణ కొరియాలో ఏడాదిపైగా ఉద్యోగం చేశాను. వార్షిక వేతనం రూ.కోటి పైనే. అయినా నాకు అది పెద్ద సంతృప్తినివ్వలేదు. సివిల్స్ పైనే మనసు ఉండిపోవడంతో ఇండియాకు వచ్చి తొలి ప్రయత్నంలోనే 24వ ర్యాంకు సాధించగలిగా. చిత్తూరులో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకున్నాక కడపలో సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ ఇచ్చారు. తర్వాత ట్రాన్స్‌కోలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ప్రస్తుతం ఈపీడీసీఎల్ సీఎండీగా పనిచేస్తూ సంస్థను అగ్రస్థానంలో నిలపడానికి కృషిచేస్తున్నా.

### పెద్ద బహుమతే దక్కింది..



ఇంజినీరింగ్ తర్వాత రూ. కోటి వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాన్ని వదులుకుని సివిల్స్ వైపు రావాలనుకోవడం కొంచెం రిస్కే. అయినా నా లక్ష్యం ముందు అది చిన్నదిగానే అనిపించింది. అమ్మ, నాన్న కూడా నన్ను ప్రోత్సహించారు. 2016 చివర్లో దక్షిణ కొరియా నుంచి దిల్లీ వచ్చాను. అప్పటికే శిక్షణ సంస్థల్లో కోర్సులు చివరికి వచ్చేశాయి. దీంతో కేవలం మూడు నెలలు మాత్రమే క్రాష్ కోర్సు శిక్షణ తీసుకున్నాను. నాకు ఇష్టమైన గణితాన్నే ఐచ్ఛికంగా ఎంచుకుని సొంతంగా సాధన చేశా. పాత పేపర్లతో పాటు సీనియర్ల సూచనలు తీసుకుని రోజుకు 14 గంటలు పాటు చదివి తొలి ప్రయత్నంలోనే 24వ ర్యాంకు సాధించడంతో పడ్డ కష్టం, చేసిన రిస్క్‌కు పెద్ద బహుమతే దక్కింది.

### ఏకాగ్రతతో చదవాలి..

జనరల్ కేటగిరీలో సివిల్స్ రాయడానికి ఆరు సార్లు అవకాశం ఉంటుంది. అన్ని అవకాశాలున్నాయి కదా.. ఏదో ఒక ఏడాది పోస్టు కొట్టొచ్చు అనేలా సాధన చేయకూడదు. ఒకటి, రెండు ప్రయత్నాల్లోనే కొలువు సాధించేలా ఏకాగ్రతతో చదువుతుండాలి. నోటిఫికేషన్ వచ్చినప్పుడు మూడు గంటలు చదువుదాం.. పరీక్ష దగ్గర పడుతున్నప్పుడు పది గంటలు చదివేద్దాం అంటే కుదరదు. మనం ఏ ఉద్యోగమైతే కొట్టాలనుకుంటున్నామో దానికి సంబంధించిన సబ్జెక్టులను తొలి రోజు నుంచే కనీసం 10 నుంచి 12 గంటలు సాధన చేస్తేనే విజయం సాధించడానికి అవకాశం ఉంటుంది. నేను ఎక్కడికి వెళ్లినా విద్యార్థులకు ఇదే చెబుతుంటా. కష్టే.. ఫలి అనే సూత్రాన్ని నమ్ముతుంటా. సివిల్స్ అనే కాదు...గ్రూప్స్, ఇతరత్రా ఏ పోటీ పరీక్షలకైనా ఇదే వర్తిస్తుంది.

## సమాజ ఉషస్సు!

పేదలకు ఉచితంగా ఊలు వస్త్రాల పంపిణీ

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం



ధ్రువపత్రం, జ్ఞాపిక అందుకుంటూ...

ఆమె సాధారణ గృహిణి... అలాగని వంటింటికే పరిమితం కాలేదు. భర్తకు వ్యాపారంలో చేదోడుగా నిలిచారు. సమాజానికి సేవ చేయాలని తపించారు. సామాజిక మాధ్యమంలో పరిచయమైన ఓ మహిళ స్ఫూర్తితో.. స్వచ్ఛంద సంస్థలో సభ్యురాలై.. పేదలకు తనవంతు సహాయ సహకారాలు అందించారు. వీరి సేవలకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది.

- **న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్**



ఇంటి వద్ద ఊలుతో స్వెటర్ అల్లుతున్న ఉషా శారద

ఏలూరు నగరానికి చెందిన సరిపె ఉషా శారద ఎగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన మహిళ. భర్త అశోక్ కుమార్ ఓ దుకాణం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో భర్తకు చేదోడుగా నిలుస్తూ.. తీరిక సమయంలో వివిధ రకాల అల్లికలు చేస్తుంటారు. ఇద్దరు ఆడ పిల్లలు, భర్తతో సంతోషంగా గడుపుతున్న ఆమె.. సమాజానికి తనవంతు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సామాజిక మాధ్యమంలో విశాఖపట్నానికి చెందిన సూరిభట్ల మాధవి పరిచయమయ్యారు. ఆమె మహిళా మనోవికాస్ పేరిట నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలో సభ్యురాలిగా చేరారు. దేశవిదేశాలకు చెందిన మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఊలుతో వస్త్రాలు తయారు చేసి, వాటిని పేదలకు ఉచితంగా అందజేస్తున్నారు. ఏడాది వ్యవధిలో 450 మంది సభ్యులు 58,115 ఊలు వస్త్రాలను పేదలు, అనాథ బాలలకు పంపిణీ చేశారు. ఇందుకు గాను సంస్థలోని సభ్యులందరికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. ఈ నెల 22న విశాఖపట్నంలో మహిళల బృందం పురస్కారం అందుకుంది. 'సమాజానికి కొంత సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తోంది. మా సేవలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం ఆనందంగా ఉంది.' అని ఉషా శారద తెలిపారు.

## పలు రైళ్లు పాక్షికంగా రద్దు, దారి మళ్లింపు

**విజయవాడ, న్యూస్‌టుడే:** నిర్వహణ పనుల దృష్ట్యా పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతో పాటు దారి మళ్లిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ★ పాక్షికంగా రద్దయిన రైళ్లు 07863 నర్సాపూర్-విజయవాడ, 07283 విజయవాడ-భీమవరం జంక్షన్, 07861 విజయవాడ-నర్సాపూర్ ★ దారి మళ్లించిన రైళ్లు (వయా విజయవాడ, గుడివాడ, నిడదవోలు మీదుగా) 22649 ఎర్నాకుళం-పాట్నా (ఈ నెల 30, అక్టోబరు 7, 14, 21 తేదీల్లో), 12756 భావనగర్-కాకినాడ పోర్ట్ (అక్టోబరు 6, 12, 19, 26 తేదీల్లో), 12509 బెంగళూరు-గువాహటి (అక్టోబరు 2, 4, 9, 11, 16, 18, 23, 25), 11019 ఛత్రపతి శివాజీ టెర్మినల్-భువనేశ్వర్ (ఈ నెల 30, అక్టోబరు 2, 4, 5, 7, 9, 11, 12, 14, 16, 18, 19, 21, 23, 25, 26), 13351 ధన్‌బాద్-అలప్పుజ (ఈ నెల 30 నుంచి అక్టోబరు 27వరకు), 18111 టాటా-యశ్వంత్‌పూర్ (అక్టోబరు 3, 10, 17, 24 తేదీల్లో).

## ఈపీఎఫ్‌వో 'నిధి ఆప్‌కే నికట్' రేపు

**వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే:** ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికట్' శిబిరాలు ఈ నెల 27న నిర్వహించనున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ వై.డి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఏలూరు జిల్లాకు సంబంధించి జంగారెడ్డిగూడెంలోని నిర్మల ఆసుపత్రి, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి కాళ్లకూరు పీఏసీఎస్ ఆవరణలో శిబిరాలు జరుగుతాయన్నారు.

## సహకార సంఘాల్లో సమస్యలు పరిష్కరించండి

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాల్లో సమస్యలు పరిష్కరించాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ పి. ధాత్రిరెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... సంఘాల ద్వారా రైతులకు 5 శాతం షేరు ధనంతో రుణాలు ఇచ్చామన్నారు. అప్పు వసూలు చేసేటప్పుడు షేరు ధనాన్ని మినహాయిస్తున్నామన్నారు. కానీ, డీసీసీబీ అధికారులు సంఘాల నుంచి షేరు ధనంతో కలిపి వసూలు చేస్తున్నారన్నారు. షేరు ధనాన్ని మినహాయించేలా చూడాలని కోరారు.

## ఎస్సైపై శాఖాపరమైన చర్యలకు సిఫార్సు

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న పలు క్రిమినల్ కేసుల్లో సాక్ష్యం ఇవ్వకుండా కోర్టుకు గైర్హాజరవుతున్న ఎస్సై కె.రాజారెడ్డిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి ఏలూరు రేంజ్ ఐజీ, ఎస్పీలకు బుధవారం సిఫార్సు చేశారు. గతంలో ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసిన రాజారెడ్డి పలు కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలు చేశారు. ఆ కేసులు ప్రస్తుతం విచారణ దశలో ఉండగా.. ఎస్సై కోర్టుకు రాకుండా ఏదో ఒక కారణంతో గైర్హాజరవుతున్నారు. ఈ సందర్భంగా కోర్టు పలుసార్లు సమన్లు జారీ చేసినప్పటికీ ఎస్సై కోర్టుకు రాకుండా వాయిదాలు అడుగుతూ ఉన్నారు. దీంతో ఎస్సైపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

## ట్రాక్టర్ బోల్తా.. యువకుడి దుర్మరణం



వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

**అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతిచెందిన ఘటన అశ్వారావుపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై యయాతి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలేనికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్వరరావు(22) ట్రాక్టర్ డ్రైవర్. అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం నుంచి పామాయిల్ గెలలను ట్రాక్టరులో అశ్వారావుపేట ఫ్యాక్టరీకి బుధవారం తరలిస్తున్నాడు. మార్గం మధ్యలో సత్తెమ్మ ఆలయం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. వెంకటేశ్వరరావు మీదుగా ట్రక్కు టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు చెప్పారు.

## సీబీఐ అధికారంటూ బెదిరింపులు

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.9 లక్షల కాజేత


**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** మేము సీబీఐ అధికారి. ముంబయి నుంచి మాట్లాడుతున్నామని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఫోనులో బెదిరించిన అగంతకులు... అతడి నుంచి రూ.9 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం మేరకు... స్థానిక శ్రీరామ్‌నగర్ ఆరో రోడ్డుకు చెందిన మహ్మద్ రాహిల్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈ నెల 23న అపరిచిత వ్యక్తి ఫోను చేశాడు. ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఫోన్ నంబరు నుంచి చట్టవ్యతిరేక కార్యక్రమాల సంభాషణలున్నాయని బెదిరించాడు. ఆ తర్వాత మరొకరు వీడియో కాల్ చేసి.. తాము ముంబయి సీబీఐ అధికారని, మీ వివరాలన్నీ తమ వద్ద ఉన్నాయని బెదిరించి ఆధార్ కార్డు చూపాడు. దాంతో ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంబేలెత్తిపోయారు. మీపై కేసు లేకుండా ఉంటాలంటే రూ.9 లక్షలు కట్టాలని చెప్పడంతో... అతను వెంటనే వారి ఖాతాలో నగదు జమ చేశారు. ఆ తర్వాత మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదుతో మూడో పట్టణ సీఐ కోటేశ్వరరావు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ఉల్లాసంగా... ఉత్సాహంగా...

కొనసాగిన జిల్లా జట్ల ఎంపికలు

**ఏలూరు తూర్పు వీధి, న్యూస్‌టుడే:** స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అండర్- 14, 17 బాలబాలికల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి పోటీలు బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగాయి. స్థానిక కోటదిబ్బ కస్తూర్బా నగరపాలక బాలికోన్నత పాఠశాల మైదానంలో బాస్కెట్ బాల్(బాలికలు), ఏఎస్ఆర్ స్టేడియం బిశ్వనాథ భర్తియా కొలనులో ఈత(బాలబాలికలు), కలెక్టరేట్ సమీప ఇండోర్ మైదానంలో రెజ్లింగ్(బాలబాలికల) పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 320 క్రీడాకారులు హాజరయ్యారు. బాస్కెట్‌బాల్(బాలికలు) 24 మంది, ఈత(బాలబాలికలు) 46 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.



బాస్కెట్ బాల్ జట్టు క్రీడాకారిణులు

**నెట్‌బాల్‌లో.. పాలకొడేరు, న్యూస్‌టుడే:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలను పాలకోడేరు మండలం గొరగనమూడిలోని స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఎంఈవో శ్రీమన్నారాయణ, ప్రజాప్రతినిధులు పోటీలను ప్రారంభించారు. ఇరు జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు తెలిపారు.



పాలకోడేరు: పోటీలో తలపడుతున్న బాలికలు

## విధుల నుంచి డీటీ తొలగింపు

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** మండల ఉప తహశీల్దారు ఎల్వీ సాగర్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై అవినీతి ఆరోపణలుండటం, ఉన్నతాధికారులను అసభ్య పదజాలంతో దూషించడం తదితరాల నేపథ్యంలో విచారణ చేపట్టారు. ఆ నివేదికను అనుసరించి విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పరిశ్రమలకు వేగంగా అనుమతులు

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏకగవాక్ష విధానంలో వేగంగా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక మండలి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 110 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపన అనుమతులు మంజూరు చేశామన్నారు. జిల్లాలో తక్కువ పెట్టుబడితో అధిక ఉద్యోగావకాశాలు కల్పించే పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. పీఎంఈజీపీ ద్వారా బ్యాంకులకు అందిన 151 దరఖాస్తుల్లో 102 అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు చేసిన 20 యూనిట్లకు రూ.1.14 కోట్ల విద్యుత్తు, వడ్డీ, అమ్మకం పన్ను, పెట్టుబడి రాయితీలు అందించాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, మత్స్యశాఖ జేడీ నాగలింగాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కూలీలకు వంద రోజుల పని దినాలు

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** ఉపాధిహామీ పథకంలో ప్రతి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించే బాధ్యత క్షేత్ర సహాయకులు, ఏపీవోదేనని డ్వామా పీడీ ఎ.రాము స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీడీవో రాజ్ మనోజ్ అధ్యక్షత వహించారు. పీడీ మాట్లాడుతూ... గత ఆర్థిక సంవత్సరంలో 1,953 పనులు చేపట్టగా- మొత్తం రూ.17.25 కోట్లు వెచ్చించారన్నారు. అందులో కూలీలకు రూ.12.05 కోట్లు వేతనాలు ఇవ్వగా- సామగ్రికి రూ.5.19 కోట్లు వెచ్చించారన్నారు. నాచుగుంట పరిధి గుళ్లపాడులో సీసీ రోడ్డు నిర్మించి బెర్మ్ వేయకుండా రూ.50 వేలు బిల్లులు చేసినట్లు సిబ్బంది గుర్తించారన్నారు. వివిధ పనుల్లో అవకతవకలు గుర్తించి రూ.33,577 రికవరీకి ఆదేశించామన్నారు. పలువురు క్షేత్ర సహాయకులకు రూ.13,500 జరిమానా విధించామన్నారు. మరో రూ.2,31,259 చేపట్టిన పనులను సకాలంలో సరిదిద్దుకోవాలని ఆదేశించారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

**చింతలపూడి, న్యూస్‌టుడే:** గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసమైన ఘటన చింతలపూడి మండలం రాఘవాపురంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆ గ్రామానికి చెందిన సీహెచ్ నాగరాజు కుటుంబం కొద్ది రోజులుగా వేరే ఊర్లోని బంధువుల ఇంట్లో ఉంటోంది. బుధవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ పేలి భారీ శబ్దం వచ్చింది. స్థానికులు వెంటనే నాగరాజుకు ఫోన్ చేసి చెప్పడంతో హుటాహుటిన ఇంటికి చేరుకున్నాడు. ప్రమాదంలో శ్లాబు పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు గృహోపకరణాలు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఎవరూ లేని సమయంలో ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం తప్పింది.



ఎమ్మెల్యే ధర్మరాజుకు విరాళం ఇస్తున్న జనసేన నాయకులు



మంత్రికి చెక్కు అందిస్తున్న నాయకులు

## వరద బాధితులకు బాసట

**ఉంగుటూరు, భీమడోలు న్యూస్‌టుడే:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి విరాళాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపు మేరకు జనసేన గణపవరం నాయకులు, గ్రామస్థులు రూ.3,17,050, భీమడోలు మండలం గుండుగొలనులోని శ్రీవిద్యాలయ పాఠశాల యాజమాన్యం రూ.50 వేలు విరాళాలు ఇచ్చారు. ఈ మొత్తాలను నగదు, చెక్కు రూపంలో నారాయణపురంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మరాజుకు బుధవారం అందజేశారు.

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** నూజివీడు మండలం పల్లెర్లమూడిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన మంత్రికి పలువురు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.1.26 లక్షలు, అదే గ్రామానికి చెందిన రాము రూ.25 వేలు, సీతారామపురం గ్రామపెద్దలు రూ.1.45 లక్షల చెక్కును మంత్రికి అందజేశారు.

### బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

## చోరీ కేసులో ఇద్దరికి జైలు

**కైకలూరు, న్యూస్‌టుడే:** చోరీ చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ కైకలూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.శివకిరణ్ బుధవారం తీర్పును వెలువరించినట్లు పట్టణ సీఐ పి.కృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. 2022 నవంబరులో ఏలూరు జిల్లా కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లోని ఓ తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి బంగారం, నగదు అపహరించారు. దీనిపై కేసు నమోదు చేసిన అప్పటి సీఐ ఏలూరుకు చెందిన అత్తోటి జాన్‌పాల్, గౌతు శేషు, తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన కొరారు వాసులను అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరు పరిచి ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై పోలీసులు బుధవారం సాక్ష్యులను ప్రవేశపెట్టి న్యాయవాది ద్వారా వాదనలు వినిపించారు. ఏలూరుకు చెందిన అత్తోటి జాన్‌పాల్, గౌతు శేషు వద్ద చోరీ చేసిన సొత్తు ఉందని నేరం రుజువైంది. ఈక్రమంలో న్యాయమూర్తి జాన్‌పాల్‌కు 97 రోజులు, గౌతు శేషుకు 142 రోజులు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. మరో వ్యక్తి కొరారు వాసుపై ఎటువంటి నేరం రుజువు కానందున నిర్దోషిగా ప్రకటిస్తూ విడుదల చేశారు.





### నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.50 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

# ఏలూరు

•ఏలూరు •దెండులూరు •ఉంగుటూరు

## ప్లాస్టిక్‌తో పర్యావరణానికి చేటు

**గణపవరం, న్యూస్‌టుడే:** ప్లాస్టిక్ వ్యర్థాలు, పాలిథిన్ కవర్లతో పర్యావరణానికి చేటు జరుగుతోందని ఎన్ఎస్ఎస్ అధికారి జి.వెంకటరమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం సరిపల్లెలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వీధుల్లో విద్యార్థులు తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించారు. తడి, పొడి చెత్తపై ఈవో రామాంజనేయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**గొల్లగూడెం(ఉంగుటూరు):** గొల్లగూడెంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. సర్పంచి కరపా వెంకట శ్రీనివాస్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. బ్యాంకు మేనేజర్ బి.సుమంత్, పంచాయతీ కార్యదర్శి కిశోర్ బాబు, రామకృష్ణ ప్రసాద్ తదితరులున్నారు.

## మానవతావాది దీన్‌దయాళ్



చిత్రపటం వద్ద నాయకుల నివాళి

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** జనసంఘ్ సహ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గొప్ప మానవతావాది అని భాజపా జిల్లా కార్యదర్శి నడపన దాన భాస్కరరావు కొనియాడారు. స్థానిక అశోకనగర్‌లోని భాజపా జిల్లా కార్యాలయంలో బుధవారం దీన్‌దయాళ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పుష్పాంజలి ఘటించారు. నాయకులు రాంబాబు, కృష్ణచైతన్య, శివ, సర్వేశ్వరరావు, దుర్గారావు, శ్రీనివాస్, కుసుమ పాల్గొన్నారు.

## రైల్వే పైవంతెన నిర్మాణానికి సర్వే

**భీమడోలు, న్యూస్‌టుడే:** భీమడోలులో 16, 216ఏ జాతీయ రహదారులను అనుసంధానిస్తూ రైల్వే గేటు దాటి కూడలి వద్ద పైవంతెన నిర్మాణానికి అధికారులు బుధవారం సర్వే చేశారు. రైల్వే గేటు వద్ద వంతెన నిర్మాణం, 600 మీటర్ల సర్వీసు రోడ్డు ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల వివరాలపై ఆరా తీశారు. రెవెన్యూ, విద్యుత్తు, ర.భ.శాఖ, రైల్వే, ఎన్‌హెచ్ అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

## పెదపాడు... పెద్ద పాట్లు!

### వాహన రాకపోకలకు నిత్యం అవాంతరాలు



బల్లరేవుతూము కూడలి వద్ద నిలిచిన వాహనాలు

**వట్లూరు(పెదపాడు), న్యూస్‌టుడే**

పెదపాడులో వాహనాల రద్దీ పెరిగిపోయింది. మండల కేంద్రం కావడంతో చుట్టుపక్కల సుమారు 15 గ్రామాల ప్రజలు వస్తుంటారు. వాహనాల రాకపోకలు అధికం కాగా, తదనుగుణంగా రహదారులు విస్తరించలేదు. ఫలితంగా తరచూ వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ప్రధానంగా బల్లరేవుతూము కూడలి, నాయుడుగూడెం రోడ్డు, హనుమాన్ జంక్షన్ రోడ్డు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గాల్లో రద్దీగా ఎక్కువగా ఉంటోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలల విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. వాహనాలను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు... తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆటోలతో అవస్థలు

గ్రామంలో ప్రధానమైన బల్లరేవుతూము, బస్టాండ్ కూడళ్ల వద్ద ఆటోలను ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నారు. రోడ్లపై సైతం ఒంపులు తిప్పుతూ నడుపుతున్నారు. దాంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపు అవుతున్నాయని పలువురు పేర్కొన్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. 'ట్రాఫిక్ నియంత్రణకు అదనపు సిబ్బంది అవసరం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశానుసారం ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం' అని హెడ్‌కానిస్టేబుల్ సువర్ణ రాజు తెలిపారు.

### ఎరక్కపోయి .. ఇరుక్కుపోయి...



ఉంగుటూరు రైల్వే గేటు సమీపంలో బుధవారం భారీగా వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరిమితికి మించి ఊక లోడుతో ఓ లారీ జాతీయ రహదారి నుంచి రైల్వే గేటు వైపు వెళ్తుండగా- మరో లారీ ఎదురొచ్చేసింది. ఫలితంగా రెండు లారీలు ఇరుక్కుపోయాయి. కనీసం పాదచారులు సైతం గేటు దాటలేని పరిస్థితి నెలకొంది. ఓవైపు వర్షం.. మరో వైపు ట్రాఫిక్‌తో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. **- న్యూస్‌టుడే, ఉంగుటూరు**

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

| | |
|---|---|
| ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535 |
| పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492 |

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే**

**సమస్య:** అశోకనగర్‌లోని అశోకగోవర్ధన నగరపాలకోన్నత పాఠశాల ముందు ప్రహరీని ఆనుకొని చెత్తాచెదారాలు పడేస్తున్నారు. రోజుల తరబడి నిల్వ ఉంటూ డంపింగ్ యార్డును తలపిస్తోంది. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. **- ఎస్.శ్యామ్‌ప్రసాద్, స్థానికుడు**

**సమాధానం:** పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తాచెదారాలు తొలగింపజేస్తాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**

**సమస్య:** ఏలూరు - పోణంగి రోడ్డులో వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. ఫలితంగా నివాసాల ముందు తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి. **- మహేశ్, స్థానికుడు**

**సమాధానం:** రోడ్డును పరిశీలించి అవసరమైన చోట వేగ నిరోధకాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. **- గోవింద మోహన్, ర.భ.శాఖ డీఈఈ**

**సమస్య:** ఒకటో పట్టణం తూర్పువీధి మోటేపల్లివారి వీధిలో వీధి కుక్కల సంచారం అధికంగా ఉంది. ఈ మార్గంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. **- ఎల్‌వీకే సురేంద్ర, స్థానికుడు**

**సమాధానం:** వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**

### వెలిగిన వీధి దీపం

స్పందనకు వందనం

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** శాంతినగర్ 13వ రోడ్డులోని విద్యుత్తు ఉపకేంద్రం వద్ద స్తంభానికి ఏర్పాటు చేసిన వీధి దీపం ఎట్టకేలకు వెలిగించారు. దీపం వెలగకపోవడంతో స్థానికులు రాత్రివేళ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 23న వార్త ప్రచురితమైంది. విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి సిబ్బందితో దీపాన్ని బాగు చేయించారు.

## బాల్య వివాహాలతో అనర్థం

**భీమడోలు, న్యూస్‌టుడే:** బాల్య వివాహాలతో అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎం.కవిత తెలిపారు. గుండుగొలనులో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం ప్రదర్శన చేపట్టారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. బాలల హక్కుల న్యాయవాద సంస్థ జిల్లా సమన్వయకర్త ఆర్.వినోద్‌కుమార్, ఆర్.అమరావతి తదితరులు పాల్గొన్నారు.



కూరగాయలు పంపిణీ చేస్తున్న తెదేపా నేత గన్ని

## వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం

**భీమడోలు, న్యూస్‌టుడే:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొన్నారు. ధాన్యం ఎగుమతి రవాణా ఛార్జీల పేరిట చిన్న రైతుల నుంచి అదనపు వసూళ్లు చేశారని పలువురు ఫిర్యాదు చేశారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయల ప్రదర్శనను పరిశీలించారు.

**ఉంగుటూరు:** కాగుపాడు, రావులపర్రులో వ్యవసాయాధికారి ఎన్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.

**ఏలూరు గ్రామీణ:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అడుగులేస్తోందని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. పెదవేగి మండలం వేగివాడ, ముండూరు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని మాట్లాడారు.

## ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సాధిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** సుపరిపాలన అందిస్తున్న ఎన్డీయే ప్రభుత్వం ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక జలపహారేశ్వరి కాలనీలోని చిరంజీవి బస్టాండ్ సమీపాన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. తెదేపా నాయకులు ఎస్కే మీరా, దాసరి ఆంజనేయులు, పెద్దిబోయిన శివప్రసాద్, చోడే వెంకటరత్నం, ఉప్పాల జగదీషబాబు, ఎస్ఎంఆర్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి చెప్పారు. పవరుపేటలోని విడిది కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

**భీమడోలు:** సూరప్పగూడెంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పాల్గొని.. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు మంచి చేసేది ఎన్డీయే ప్రభుత్వమేనని చెప్పారు. ఇందుకు వంద రోజుల్లో సాధించిన ప్రగతే నిదర్శనమన్నారు.

## స్వచ్ఛతలో భాగస్వాములు కండి



ప్రతిజ్ఞ చేస్తున్న ధర్మరాజు, రామకృష్ణారెడ్డి తదితరులు

**చేబ్రోలు(ఉంగుటూరు), న్యూస్‌టుడే:** స్వచ్ఛతా హీ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు(ఉంగుటూరు), ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(అనపర్తి) పిలుపునిచ్చారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా చేబ్రోలులో బుధవారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచి రాంధే లక్ష్మీసునీత ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి నిత్యావసరాలు, పండ్లు, కిట్లు అందజేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. అంతకు ముందు దీన్‌దయాళ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీన్‌దయాళ్ గొప్ప సంఘసంస్కర్త అని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు కొనియాడారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, భాజపా శాసనసభ శరణాల మాలతీరాణి, బొల్లిన నిర్మలా కిశోర్, నగరపాటి సత్యనారాయణ, అడపా శోభారాణి పాల్గొన్నారు.

## తెదేపాలో కష్టపడే వారికి గుర్తింపు

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** తెదేపాలో కష్టపడి పని చేసిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు, విప్ పేర్లను బుధవారం ఆయన ప్రకటించారు. డిప్యూటీ మేయర్‌గా మూర్త్రోజుల కిందటే 47వ డివిజన్‌కు చెందిన తెదేపా కార్పొరేటర్ వందనాల దుర్గాభవానీని ఖరారు చేశారు. ఎన్నికలకు ముందు వైకాపాను వీడి తెదేపాలో చేరిన కార్పొరేటర్లు పప్పు ఉమామహేశ్వరరావు, కర్రి శ్రీనివాసరావును తాజాగా డిప్యూటీ మేయర్లుగా ప్రకటించారు. వీరిద్దరూ చెరో సంవత్సరం పదవిలో కొనసాగనున్నట్లు చెప్పారు. కార్పొరేషన్ విప్‌గా 28వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల అరుణ పేరును ఎమ్మెల్యే ఖరారు చేశారు.

## జనసేన నాయకుల దీక్ష

**దెందులూరు, న్యూస్‌టుడే:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మద్దతుగా కొవ్వలిలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యాన పలువురు నాయకులు బుధవారం ప్రాయశ్చిత దీక్ష చేపట్టారు. జనసేన, భాజపా నాయకులు మేడిచర్ల కృష్ణ, గుమ్మడి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల నిలిపివేతపై ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మొండూరు గ్రామస్థులు

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** తమకు రావాల్సిన సామాజిక పింఛన్లను నిలిపేశారంటూ పెదవేగి మండలం మొండూరు ఎస్సీ కాలనీ వాసులు బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా పని చేశామన్న కారణంతో దురుద్దేశపూర్వకంగా కాలనీలోని సుమారు 47 మందికి పింఛన్లు ఇవ్వలేదని ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు అనుకూలమైన వారికి పింఛన్లు ఇస్తూ, రాజకీయ కక్షతో ఎస్సీ కాలనీ వాసులకు ఆపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట కంచాలు మోగిస్తూ నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ఎన్నికల హామీలను ఎన్డీయే ప్రభుత్వం అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద థాలీ బజావో పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించారు. కంచాలు మోగిస్తూ నినాదాలు చేశారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ... సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామంటూ ఎన్డీయే హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిందన్నారు. మూణ్నెల్ల పాలన పూర్తయినా, పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, నాయకులు రామ్మోహనరావు, నరసింహమూర్తి, సత్యేంద్రబాబు, ప్రసాద్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వరదలను సమర్థంగా ఎదుర్కొన్నాం



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

**దెందులూరు, న్యూస్‌టుడే:** జిల్లాలో రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల సమన్వయం, సహకారంతో వరదలను సమర్థంగా ఎదుర్కోగలిగామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. పోతునూరులోని స్వరాజ్యభవన్‌లో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వరద బాధితుల సహాయార్థం జిల్లాకు రూ.7 కోట్లు విడుదల చేశారన్నారు. పంటలు, ఇళ్లు తదితరాలు నష్టపోయిన బాధితుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. వరదల సమయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కృషి అభినందనీయమని కొనియాడారు. ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ... సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తోందన్నారు. దెందులూరు మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఆర్డీవో ఖాజావలీ, తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో శ్రీలత, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

- అంతకుముందు పోతునూరులో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని పంట పొలాలను పరిశీలించారు. పంటలకు సోకుతున్న తెగుళ్లు, సస్యరక్షణ చర్యలపై అధికారులు, రైతులతో చర్చించారు. అక్టోబర్‌లో ధాన్యం సేకరణ ప్రారంభిస్తున్న నేపథ్యంలో... రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు అధికారులను ఆదేశించారు.



వాలీబాల్ జట్టుతో పద్మాలత, పీడీలు, పీఈటీలు

## ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం

**ఏలూరు తూర్పువీధి, గ్రామీణ, న్యూస్‌టుడే:** శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 విభాగాల్లో యోగా, చదరంగం, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో బాలుర ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. ఏలూరు నగరం, గ్రామీణ విద్యా శాఖాధికారులు రవిప్రకాశ్, రంగయ్య పోటీలు ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. యోగా 7, చదరంగం 2, వాలీబాల్ 24, కబడ్డీ 24, ఖోఖో 24 మంది చొప్పున క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్-14, 17 విభాగం సమన్వయకర్త పి.పద్మలత, ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్, పీడీలు రమేశ్, ఎన్.లీలాకుమారి, మాధవీలత, శ్రీనివాస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



పతకాలు, ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థులు

**కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే:** ఏలూరు ఏఎస్ఆర్ మైదానంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఆయా విభాగాల్లో కె.దీవెనకుమార్, జి.సందీప్, ఎ.సుభాష్, యు.మేరీ, యశ్వంత్, వై.ప్రేమ్‌కుమార్, ఆంజనేయస్వామి జిల్లా జట్లకు అర్హత సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, పీడీలు బుధవారం అభినందించారు.

**ఏలూరు గ్రామీణ:** పెదవేగి గురుకుల పాఠశాలలో సాఫ్ట్, బేస్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి 360 మంది క్రీడాకారులు హాజరయ్యారు. నిర్వాహకుడు జయరాజు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

## భావవ్యక్తీకరణ పాత్ర కీలకం

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో భావవ్యక్తీకరణ కీలకపాత్ర పోషిస్తుందని విశ్రాంత అధ్యాపకుడు బి.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక సీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. 'ద రోల్ ఆఫ్ కమ్యూనికేషన్ ఇన్ అవర్ లైఫ్, ప్రొఫెషన్'పై చంద్రశేఖర్ ఉపన్యాసమిచ్చారు. ప్రధానాచార్యుడు కేవీ రామరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఏలూరు విద్యా విభాగం:** స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో 'మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'పై బుధవారం సదస్సు నిర్వహించారు. విజయవాడకు చెందిన శాండ్ స్పేస్ టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధులు లక్ష్మీప్రసన్న, సాయినందిని హాజరై మెషిన్ లెర్నింగ్‌లో రకాలు, వాటి ద్వారా డేటా పొందడంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

### ఏలూరు సినిమాలు

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే**

| | |
|---|---|
| అంబిక డీలక్స్ | కమిటీ కుర్రోళ్లు |
| అంబిక మినీ | ఆయ్ |
| అంబిక లిటిల్ | ---------- |
| సాయిబాలాజీ | గొర్రె పురాణం |
| బాలాజీ | ప్రేమికుడు |
| సత్యనారాయణ స్క్రీన్ 1 | బొమ్మరిల్లు |
| సత్యనారాయణ స్క్రీన్ 2 | మత్తు వదలరా 2 |
| సత్యనారాయణ స్క్రీన్ 3 | ఏఆర్ఎం |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 1 | ఉత్సవం |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 2 | 35 చిన్న కథ కాదు |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 3 | గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1 | సరిపోదా శనివారం |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2 | గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3 | ఏఆర్ఎం |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4 | మత్తు వదలరా 2 |

## అవి ఇవి అన్నీ

**మార్చి నెలాఖరులోపు గృహ నిర్మాణాల పూర్తి.. గణపవరం, న్యూస్‌టుడే:** మండలంలో మార్చి నెలాఖరులోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆ శాఖ డీఈ ప్రసాద్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో బుధవారం అధికారులతో సమావేశమై మాట్లాడారు. సకాలంలో గృహాలు నిర్మించుకుంటే కేంద్రం ఇచ్చే నిధులు వెనక్కి వెళ్లిపోయే అవకాశముందని చెప్పారు. ఈ నెల 28న నిర్వహించే 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ ఏఈ కిరణ్, ఏపీఎం సీహెచ్ రాజేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**నేడు ప్రతిభా పురస్కారాల ప్రదానం.. ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** స్థానిక వైఎంహెచ్ఏ హాలులో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కేవీ సత్యనారాయణ ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా పలువురు ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నారు.

**రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** పెదపాడు సెక్షన్ పరిధిలోని నిర్వహణ పనుల నిమిత్తం ఏపూరు, అప్పనవీడు, కొక్కిరపాడు, తాళ్లమూడి, వేంపాడు, తోటగూడెం, పునుకొల్లు, వసంతవాడ, పెదపాడు, గోగుంట ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని బుధవారం ప్రకటనలో కోరారు.

**పగిలిన పైపు.. రోగుల ఇబ్బందులు.. ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో మంచినీటి ట్యాంకుకు వెళ్లే పైపు బుధవారం పగిలిపోయింది. దాంతో కుళాయిల నుంచి నీరు రాకపోవడంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు సాయంత్రానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ట్యాంకర్లతో నీరు తెప్పించి ట్యాంకుల్లోకి ఎక్కించారు.

**ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు.. ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** స్థానిక ఆర్ఆర్ పేటలోని అన్న క్యాంటీన్‌ను బుధవారం జనసేన, భాజపా నాయకులు సందర్శించారు. జనసేన నగరాధ్యక్షుడు నగిరెడ్డి కాశీనరేశ్ నేతృత్వంలో స్థానికులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అన్నార్తుల ఆకలి తీర్చే అన్నపూర్ణ అన్న క్యాంటీన్ అని వారు పేర్కొన్నారు.

**దెందులూరు ఎంపీడీవోగా శ్రీదేవి..**

**దెందులూరు, న్యూస్‌టుడే:** దెందులూరు ఎంపీడీవోగా శ్రీదేవిని నియమిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె కామవరపుకోట ఎంపీడీవోగా పని చేస్తున్నారు. అక్టోబరు 2వ తేదీ తరువాత బాధ్యతలు స్వీకరించనున్నారు.

## గంజాయి తరలింపు... ఇద్దరి అరెస్టు

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 2.160 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... ఏలూరు మూడో పట్టణ పోలీసు అధికారులు బుధవారం గస్తీ తిరుగుతుండగా- వారి వాహనాన్ని చూసి ఇద్దరు యువకులు పరారయ్యేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువకులను తనిఖీలు చేయగా, వారి వద్ద గంజాయి లభించింది. రాజమహేంద్రవరం గోకవరానికి చెందిన బండి రాజు అలియాస్ పండు, ఆకివీడు చెందిన నక్కా మహేశ్ ఏలూరుకు గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వీరిపై గతంలోనూ కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

## పట్టపగలు చోరీ.. కేసు నమోదు

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** స్థానిక ఆదివారపుపేట రజకుల కాలనీకి చెందిన గోదాడ సురేశ్ ఇంటికి తాళమేసి అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రి భద్రయ్యను బుధవారం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. తిరిగి ఇంటికొచ్చి చూడగా- తలుపు తాళాలు పగులగొట్టి కనిపించాయి . ఇంట్లోకెళ్లి పరిశీలించగా.. బంగారు, వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మద్యం దుకాణం తొలగించాలి


**నిడమర్రు, న్యూస్‌టుడే:** పెదనింద్రకొలనులో మద్యం దుకాణాన్ని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. స్థానిక పీహెచ్‌సీ సమీపంలోనే దుకాణం ఉందని, ఈ మార్గంలోనే విద్యార్థులు సైతం రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొంటున్నారు. విద్యార్థులు, రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని దుకాణాన్ని మార్చాలని కోరారు.

## నిలువెత్తు నిర్లక్ష్యం



ఏలూరు నగరం సత్రంపాడు పారిశ్రామికవాడ ప్రాంతంలోని జిల్లా తపాలా కార్యాలయం రోడ్డులో రెండు విద్యుత్తు పరివర్తకాలకు పచ్చని తీగలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గంలో నిత్యం పెద్ద సంఖ్యలో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. తీగల కారణంగా ఈ దారిలో ప్రయాణమంటేనే భయపడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు తూర్పువీధి**

## ముందుకెళ్లని మురుగు



మండల కేంద్రం నిడమర్రులో పారిశుద్ధ్యం లోపించింది. గ్రామంలో మురుగు కాలువలు లేకపోవడంతో... ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోతోంది. రెండ్రోజుల క్రితం కురిసిన వర్షానికి రోడ్లపై నీరు నిలిచిపోయింది. మురుగు నీటిలోనే స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని ఎంపీడీవో విజయకుమారి పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

## నాణ్యత డొల్ల



ఉంగుటూరు మండలం చేబ్రోలు నుంచి నల్లమాడు వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర రూ.3.50 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు చేశారు. జనవరి 26న అప్పటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలివ్వడంతో. . ఆర్నెల్లకే డొల్లతనం బయటపడింది. పలు చోట్ల సన్నపాటి బీటలు వారి కంకర తేలి రహదారి అధ్వానంగా మారింది. రహదారికి మరమ్మతులు చేయిస్తామని ర.భ.శాఖ జేఈ భాస్కరరావు తెలిపారు. **- న్యూస్‌టుడే, ఉంగుటూరు**

# పోలవరం

•పోలవరం •చింతలపూడి

## ఐటీడీఏల ముట్టడికి కార్యాచరణ

**వేలేరుపాడు(కుక్కునూరు),న్యూస్‌టుడే:** అయిదో షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల హక్కులకు భంగం వాటిల్లుతోందని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు(ఏఎస్పీ) ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం వేలేరుపాడులో ఏఎస్పీ, ఏవీఎస్పీ, ఏటీఏల ఉమ్మడి సమావేశం సోడే సీతారామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఏఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న అధికారులకు ఆదివాసీ చట్టాలపై సరైన అవగాహన లేక, వాటిని చిత్తశుద్ధితో అమలు చేయడం లేదని విమర్శించారు. 1/70 చట్టం పకడ్బందీగా అమలు జరగాల్సిన ప్రాంతాల్లోనూ గిరిజనేతరులు భారీ నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఆదివాసీ చట్టాలపై వివక్షను నిరసిస్తూ త్వరలో ఐటీడీఏల ముట్టడికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ధర్మరాజు, ముత్యాలరావు, మోహన్ పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం రూ.3.86 లక్షలు

**జీలుగుమిల్లి, న్యూస్‌టుడే:** జీలుగుమిల్లి జగదాంబ ఆలయ హుండీ ఆదాయన్ని బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులు లెక్కించారు. 14 నెలలకు గాను రూ.3,86,663 వచ్చింది. నోట్ల రూపంలో రూ.3,49,950, నాణేల ద్వారా రూ.36,713 వచ్చినట్లు ఈవో సంగమేశ్వరశర్మ వివరించారు.

## ఎంపీడీవోగా వాణి



**లింగపాలెం, న్యూస్‌టుడే:** లింగపాలెం ఎంపీడీవోగా కందుల వాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

## ముంపు ఇళ్లకు పరిహారం మంజూరు

**కుక్కునూరు, న్యూస్‌టుడే:** గోదావరి వరదల్లో ముంపునకు గురైన ఇళ్లకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. రెండు, మూడు రోజుల్లో బాధితుల ఖాతాలకు నగదు జమవుతుందని అధికారులు చెబుతున్నారు. కుక్కునూరు మండలంలో 32, వేలేరుపాడు మండలంలో 52 ఇళ్లు ముంపు బారిన పడ్డాయి. ఒక్కో ఇంటికి రూ.10 వేలు చొప్పున సాయం అందనుంది.

## కుల నిర్మూలనకై ఉద్యమించాలి

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** మహాత్మా జ్యోతిరావ్ పులే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల నిర్మూలనకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ అన్నారు. సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినం సందర్భంగా జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డులో పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బన్నె వినోద్ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ముప్పిడి అబ్బులు, గంపల వెంకటేశ్, దుర్గారావు, రాంబాబు, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల మడుగులో పాఠశాల

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం మండలం వేగవరం మోటేపల్లి రుక్మథరావు మెమోరియల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీ గతేడాది మిగ్‌జామ్ తుపాను ధాటికి పడిపోయింది. 2002లో సుమారు మూడెకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ పాఠశాలలో 143 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆవరణ పల్లంగా ఉండటంతో భారీ వర్షం కురిసినప్పుడు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు పాఠశాల మైదానంలో నుంచి సమీపంలోని చెరువు వైపు ప్రవహిస్తుంది. ఈ కారణంగా ఏడాది కిందట ప్రహరీ రెండు చోట్ల కూలింది. పక్కనే చెరువు ఉండటంతో తమ పిల్లలకు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా పాఠశాలకు వచ్చే రోడ్డు సైతం అక్కడక్కడా కోతకు గురైంది. మైదానంలో ఎప్పుడూ నీరు నిలుస్తుండటంతో విద్యార్థులు ఆడుకునేందుకు వీలుండటం లేదు. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విష పురుగుల సంచరిస్తున్నాయంటున్నారు. సమస్యలతో పడలేక సుమారు కొందరు విద్యార్థులు జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలకు వెళుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రహరీ నిర్మాణానికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు జంగారెడ్డిగూడెం మండల విద్యాశాఖాధికారి-1 బుద్ధుల రాముడు తెలిపారు.



కోతకు గురై రాళ్లు లేచిన రోడ్డు



కూలిన ప్రహరీ

## హరిహరసుతునికి విశేష పూజలు



మూలవిరాట్‌కు అభిషేకం

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, అర్చన, ఇతర పూజాధికాలను ఆలయ అర్చకులు జొన్నగడ్డ తేజశర్మ నేతృత్వంలో నిర్వహించారు. భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

## 'సమస్యల పరిష్కార కార్యక్రమం బుధవారమే నిర్వహించాలి'

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద గిరిజన సమస్యల పరిష్కారం కార్యక్రమాన్ని ఎప్పటిలా బుధవారం నిర్వహించాలని ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ కోరారు. బుట్టాయగూడెంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు బుధవారం కన్నాపురంలో జరిగే వారపుసంతకు వస్తారని, ఆ క్రమంలో ఐటీడీఏకు వచ్చి సమస్యలు విన్నవించుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు పునరాలోచించాలని కోరారు.

## ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పథకాల్లో భాగంగా మంజూరై.. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరుకు పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్డీవో ఎం.రాజు గృహనిర్మాణ సంస్థ అధికారులకు సూచించారు. కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అనుబంధ శాఖల యంత్రాంగానికి గృహ నిర్మాణ సంస్థ డీఈఈ బి.సువర్ణరాజు దిశానిర్దేశం చేశారు. ఎంపీడీవో ఆర్బీ శ్రీలక్ష్మి, గృహనిర్మాణ సంస్థ ఏఈ సతీష్, ఎంఈవో జె.సురేశ్‌బాబు, ఈవోపీఆర్డీ సతీష్, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజు

**28న సమావేశం.. పోలవరం, న్యూస్‌టుడే:** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా 2021-22లో మంజూరైన గృహాల లబ్ధిదారులతో ఈ నెల 28న సచివాలయాల్లో సమావేశాలు నిర్వహించి.. నిర్మాణాలు పూర్తి చేసేలా చూడాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్‌బాబు.. ప్రత్యేక అధికారులకు సూచించారు. పోలవరం ఎంపీడీవో కార్యాలయంలో 'మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా పది పంచాయతీల ప్రత్యేక అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణ సంస్థ ఏఈ హరిరాంబాబు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## గర్భిణులకు సీమంతాలు

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమీకృత శిశు అభివృద్ధి సేవల పథకం పర్యవేక్షకురాలు లక్ష్మీ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. నాయకులు సాయిల సత్యనారాయణ, గంధం గోపాలకృష్ణ, తారిపిరెడ్డి రామకృష్ణ, తాళ్లూరి వెంకటేశ్వరావు, నరసింహ, గొల్లమండల కేశవరావు పాల్గొన్నారు.



అక్కంపేటలో..



తూటికుంట పునరావాస కాలనీలో..

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** రెడ్డిగణపవరం శివారు తూటికుంట పునరావాస కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద నలుగురు గర్భిణులకు సీమంతాలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాలను ప్రదర్శించారు. సర్పంచి కుండ్ల లక్ష్మీకాంతం, చింతలాడ ముత్యాలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## సంక్షోభంలోనూ సంక్షేమం

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అమలు చేస్తున్న ఘనత ఎన్డీయే ప్రభుత్వానికే దక్కుతుందని తెదేపా పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. పట్టణంలోని 7, 8 సచివాలయాల పరిధిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వంద రోజుల్లో ప్రభుత్వ పాలనను ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు మండవ లక్ష్మణరావు, నంబూరి రామచంద్రరాజు, పెనుమర్తి రామ్‌కుమార్, రాజాన సత్యనారాయణ, వలవల తాతాజీ, రామలక్ష్మి, తూటిగుంట రాము పాల్గొన్నారు.

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** నిమ్మలగూడెం, కృష్ణాపురం గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. నిమ్మలగూడెంలో తెదేపా సీనియర్ నాయకుడు వెత్సా చిట్టిబాబు, కృష్ణాపురంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు తీగల గోపాలకృష్ణ, పలువురు కూటమి నాయకులు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

**లింగపాలెం, న్యూస్‌టుడే:** ఎన్నికల్లో ప్రజలిచ్చిన విజయాన్ని బాధ్యతగా భావించి.. రాష్ట్రం అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వలసపల్లి అడ్డరోడ్డు నుంచి ధర్మాజీగూడెం వరకు పల్లె వెలుగు బస్సులో ప్రయాణించి, మూడు నెలల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రయాణికులకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ధర్మాజీగూడెంలో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. గారపాటి బుజ్జియ్య, చలపతిరావు, సీహెచ్ రామ్మోహనరావు, ఎం.ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్మాజీగూడెం కరపత్రాలు చూపుతున్న రోషన్ కుమార్



జంగారెడ్డిగూడెంలో..

**వరద బాధితులకు ఆర్థిక సాయం..** విజయవాడ వరద బాధితుల సహాయార్థం చింతలపూడి జోన్ ప్రైవేటు పాఠశాలల యజమాన్యం రూ.1.05 లక్షలు విరాళాన్ని చెక్కు రూపంలో ధర్మాజీగూడెంలో తెదేపా సీనియర్ నాయకుడు బుజ్జియ్య ఇంటి వద్ద ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు అందజేసింది. కార్యక్రమంలో శివకుమార్, రాంబాబు, పాపారావు, రత్నాకర్, చక్రధరరావు పాల్గొన్నారు.

**న్యాయవాదుల వినతి.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీనివాస్ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను బుధవారం కోరారు. ఈ మేరకు ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను అసోసియేషన్ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంగారెడ్డిగూడెం కోర్టుకు నూతన భవనం, సీనియర్ సివిల్ కోర్టు మంజూరు, పేద న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విన్నవించామన్నారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి విత్తనాల రాజు, మాదేపల్లి క్రాంతికుమార్, ఉద్దండం ఏసుబాబు తదితరులు ఉన్నారు.

**నేడు ఎమ్మెల్యే పర్యటన.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ గురువారం పాల్గొంటారని తెదేపా పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ తెలిపారు.

## దీన్‌దయాళ్ మార్గం అనుసరణీయం

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** భాజపా సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ చూపిన మార్గం అనుసరణీయమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు అన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పట్టణంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మానేపల్లి రామారావు, తాటికొండ సుధాకర్, వేమూరి శ్రీనివాస్, పీవీ వరలక్ష్మి, పర్వతం రాధాకృష్ణ, రత్తయ్య పాల్గొన్నారు.



చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

## గుంతలు పూడ్చండి.. ఆపద తొలగించండి!

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రధాన రహదారులపై ఏర్పడిన గోతులు ప్రమాదకరంగా మారాయి. రాకపోకలు సాగించాలంటే ద్విచక్ర వాహన చోదకులు భయపడుతున్నారు. ఎస్బీఐ నగర్ సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు దారుణంగా ఉన్నాయి. వాటిలో వర్షపు నీరు నిలవడంతో గుర్తించలేకుండా ఉన్నాయి. రాత్రి వేళల్లో ఆ ప్రాంతం మొత్తం అంధకారంగా ఉండటంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వెంటనే పూడ్చుతాం..** ప్రధాన రహదారులపై గుంతలను వెంటనే పూడ్చుతాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. **-సుందరరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ, చింతలపూడి**



## మంజూరు అయిదు.. ఉన్నది ఒక్కరే..!

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** పద్నాలుగు వందల మంది విద్యార్థులతో జిల్లాలోనే అతి పెద్ద పాఠశాలల్లో ఒకటైన జంగారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఒక్కరే ఉన్నారు. విద్యతో పాటు ఆటలు కూడా ముఖ్యమైన తరుణంలో 1,400 మందిని నియంత్రించడం, ఆటలు నేర్పడం కష్టసాధ్యంగా మారింది. వాస్తవానికి ఈ పాఠశాలకు అయిదుగురు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయి. కానీ ఒక్కరే ప్రస్తుతం సేవలందిస్తున్నారు. ఇటీవల జరిగిన పని సర్దుబాటులో ఎవరినైనా నియమిస్తారని ఆశించారు. కానీ ఫలితం లేదు. ఈ కారణంగా పిల్లలు నష్టపోతున్నారని ప్రధానోపాధ్యాయిని లోవకుమారి తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.



విద్యార్థులతో సాధన చేయిస్తున్న పీడీ జయరాజు

## మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** అనారోగ్య సమస్యలతో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చింతలపూడి మండలం శంకుచక్రపురంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నక్కా రామలక్ష్మి(31) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. తగ్గడం లేదనే మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పరీక్షకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. రామలక్ష్మికి భర్త, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

## మార్బుల్స్ మీదపడి కార్మికుడికి తీవ్ర గాయాలు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ తూర్పురాజగోపురం వద్ద నూతనంగా నిర్మిస్తున్న వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌కు సంబంధించిన మార్బుల్స్‌ను లారీ నుంచి దించుతుండగా అవి మీదపడి అంజిబాబు అనే కార్మికుడికి బుధవారం తీవ్ర గాయాలయ్యాయి. సెక్యూరిటీ సిబ్బంది అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు.

## పనులు పూర్తి కావు.. వెతలు తీరవు!

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయగూడెం మండలం కొల్లాయిగూడెం, నందాపురం, నిమ్మలగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు ఏడాదిగా అసంపూర్తిగా నిలిచాయి. నిధుల కొరత, సిమెంటు సరఫరా లేక ఈ పరిస్థితి నెలకొంది.

అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు



నందాపురంలో అసంపూర్తి నిర్మాణం

### అద్దె గృహాల్లోనే కాలక్షేపం

ఆయా గ్రామాల్లో కేంద్రాలను ఏళ్ల తరబడి అద్దె గృహాల్లో నిర్వహిస్తున్నారు. చిన్నారులను కూర్చోబెట్టడం, సామగ్రి ఉంచడం, పోషకాహారం ఉంచేందుకు అవస్థలు పడుతున్నారు. నాడు- నేడులో 2022 ఆగస్టులో రూ.13.50 లక్షల చొప్పున భవనాలు మంజూరయ్యాయి. కేఆర్‌పురం ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో పనులు చేపట్టారు. నిమ్మలగూడెంలో పునాదులు, కొల్లాయిగూడెం, నందాపురంలలో శ్లాబు దశల్లో పనులు ఆగిపోయాయి. నిమ్మలగూడెంలో కేవలం రూ.3.50 లక్షలు, నందాపురం, కొల్లాయిగూడెంలలో రూ.5.20 లక్షలు చొప్పున వెచ్చించారు. మిగిలిన నిధులు, సిమెంట్ రాగానే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఏఈ అబ్దుల్ రహీం తెలిపారు.

## భూసార పరీక్షలు తప్పనిసరి

**టి.నరసాపురం, న్యూస్‌టుడే:** ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించడం ద్వారా పోషకాల లభ్యత, లోపాలు తెలుస్తాయని ఏవో బి.సుమలత అన్నారు. బండివారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈ-పంట నమోదు చేయించాలని సూచించారు. పశువైద్యాధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. రైతులు పాల్గొన్నారు.

**ఎండు తెగులతో జాగ్రత్త.. చింతలపూడి, న్యూస్‌టుడే:** వరిలో ఎండు తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఏరువాక కేంద్రం ఏలూరు సమన్వయకర్త కె.ఫణికుమార్ అన్నారు. మండలంలోని వరి పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకే నత్రజని వాడాలన్నారు. గట్లపై గడ్డి, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎండు తెగులు వ్యాపిస్తే పొలంలోని పాత నీటిని బయటకు పంపి, కొత్త నీటిని పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏవో మీనాకుమారి పాల్గొన్నారు.

**సేంద్రియ సాగుతో సత్ఫలితాలు.. కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** సేంద్రియ సాగుతో సత్ఫలితాలు సాధించొచ్చని తహసీల్దార్ చల్లన్న దొర రైతులకు సూచించారు. పరింపూడిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటైన సమీక్షా సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గోడ పత్రాలను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఉద్యాన శాఖ రాయితీలను అధికారి ధీరజ్ లక్ష్మణ్ వివరించారు. వరి సాగులో సమస్యలను రైతులు మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులకు వివరించారు. పశుసంవర్ధకశాఖాధికారి అపూర్వ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఇసుక కోసం వెళితే పోలీసులు కొట్టారు'!

**పోలవరం, న్యూస్‌టుడే:** 'ఇసుక కోసం ఈ నెల 23న ట్రాక్టర్‌తో పోలవరం మండలం కొవ్వాడ కాలువకు వెళ్లా.. అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. చరవాణి సైతం లాక్కున్నారు. ఈ విషయమై తెదేపా, జనసేన నాయకులతో చెప్పించినా పట్టించుకోలేదు. నన్ను కొట్టారు. ఆ అవమానం భరించలేక పురుగుల మందు తాగి చనిపోవాలనుకుంటున్నా. ఈ వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పంపాలి' అంటూ పట్టిసీమకు చెందిన నాగం అయ్యప్ప అనే యువకుడు చేసిన వీడియో బుధవారం మధ్యాహ్నం సామాజిక మాధ్యమంలో వ్యాప్తి చెందింది. విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీడియో విషయమై ఎస్సై పవన్‌కుమార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా తెల్లవారుజామున ఇసుక తరలిస్తున్నారు. ఆ రోజు నాలుగు ట్రాక్టర్లు పట్టుకున్నాం. అందులో అయ్యప్పది ఒకటి. దాడి చేసినట్లు చెప్పడం అర్థరహితమని ఎస్సై పేర్కొన్నారు.

## భద్రతతో కూడిన సౌకర్యాలు కల్పించాలి

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రాంతాల్లో భద్రతతో కూడిన సౌకర్యాలు కల్పించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిశోర్‌కుమార్ అన్నారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొనే సమస్యలను ఏ విధంగా అధిగమించాలనే అంశంపై జంగారెడ్డిగూడెం కోర్టు ఆవరణలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కేవీఎస్ఆర్ తేజస్వి మాట్లాడుతూ తోటి ఉద్యోగులతో సమస్యలు తలెత్తితే ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అనంతరం మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ స్వరూపారాణి, మహిళా న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి తేజస్వి

## తెదేపాలోకి వైకాపా ఎంపీటీసీ సభ్యుడు!

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు ఎంపీటీసీ సభ్యుడు అల్లాడ హరేరామకృష్ణను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెదేపాలోకి ఆహ్వానించారు. నల్లజర్లలోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యేను హరేరామకృష్ణ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీలోకి ఆహ్వానించి.. గ్రామాభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లంకా సత్యనారాయణ, కారుమంచి మురళి, అల్లాడ రాజేశ్, జయ సత్యనారాయణ, సుబ్బారావు, కమ్మ రామకృష్ణ, నల్లూరి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయకుడి ఊరేగింపు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమలలో వినాయకుడి ఊరేగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి పచ్చిపూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం తీన్‌మార్, గరగనృత్యాలు, విచిత్ర వేషధారణలు నడుమ ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది.

## పేదలకు భూములు పంచాలి


**టి.నరసాపురం, న్యూస్‌టుడే:** కోనేరు రంగారావు భూ కమిషన్ సిఫార్సుల ఆధారంగా రాష్ట్రంలోని 94 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు టీవీఎస్ రాజు అన్నారు. అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలో వివాదంలో ఉన్న భూమిని బుధవారం ఆ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.

## 'బొరగం' వెంట తరలిన శ్రేణులు

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** ట్రైకార్ ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు.. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు బుధవారం రాష్ట్ర సచివాలయానికి వెళ్లారు. ఆయన వెంట నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన తెదేపా శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అనంతరం బొరగం శ్రీనివాసులను వారంతా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పోలవరం ఏఎంసీ మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, టి.నరసాపురం మాజీ ఎంపీపీ శీలం వెంకటేశ్వరరావు, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల తెదేపా అధ్యక్షులు నరేశ్, సోంబాబు, తెదేపా పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు అనపర్తి వెంకటనారాయణ, ఏలూరు పార్లమెంటు తెలుగుయువత కార్యదర్శి నల్లూరి గోపి, పలువురు మహిళా నాయకులు ఉన్నారు.

## నాణ్యమైన పొగాకు పండిస్తేనే అధిక ధర

**జంగారెడ్డిగూడెం పట్టణం, కొయ్యలగూడెం, న్యూస్‌టుడే:** రైతులు నాణ్యమైన పొగాకు పండించి అధిక ధరలు పొందాలని వేలం నిర్వహణాధికారి శ్రీహరి అన్నారు. జంగారెడ్డిగూడెం ఒకటో వేలం కేంద్రంలో వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ముగింపు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కొనుగోళ్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగిందన్నారు. తమ కేంద్రం ద్వారా 15 మిలియన్ కిలోలు కొన్నట్లు పేర్కొన్నారు. వర్జీనియా పొగాకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి కిలో గరిష్ఠ ధర రూ.410 పలికిందన్నారు. అనంతరం బోర్డు అధికారులు, సిబ్బంది, పొగాకు కంపెనీల ప్రతినిధులను రైతు సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ గ్రేడ్ ఆఫీసర్(ఎస్జీవో) బి.సుధీర్, రైతు నాయకులు పరిమి రాంబాబు, గద్దె లక్ష్మణరావు, కరాటం రెడ్డిబాబు, వామిశెట్టి హరిబాబు, గద్దె ప్రసాద్, కూచిపూడి రమేశ్, అల్లూరి రామకృష్ణ, కంపెనీల ప్రతినిధులు కోటేశ్వరరావు, రఘు, జోషి తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో బోర్డు అధికారులు, సిబ్బంది, కంపెనీల ప్రతినిధులను సన్మానించిన రైతులు

### రూ.478.66 కోట్ల విక్రయాలు

ప్రస్తుత సీజను(2023-24)కు సంబంధించి కొయ్యలగూడెం వేలం కేంద్రంలో పొగాకు విక్రయాలు బుధవారంతో ముగిశాయి. మొత్తం రూ.478.66 కోట్ల విలువైన పొగాకును రైతులు విక్రయించారు. కిలో పొగాకు సరాసరి ధర రూ.325.90 లభించింది. 10.50 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా.. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా 14.68 మిలియన్ కిలోల పొగాకును వేలంలో పాల్గొన్న 29 కంపెనీలకు చెందిన ప్రతినిధులు కొనుగోలు చేశారు. ఈ సీజనులో ఎటువంటి ఒడుదొడుకులు లేకుండా వేలం సవ్యంగా సాగిందని పొగాకు బోర్డు ప్రాంతీయ మేనేజరు జీవీకే ప్రసాదు తెలిపారు.

### నేటి నుంచి చూర కొనుగోళ్లు

కొయ్యలగూడెం వేలం కేంద్రంలో ఈ నెల 26 నుంచి చూర(స్క్రాప్) పొగాకు కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు నిర్వాహకురాలు గ్రేస్ మార్గరేట్ తెలిపారు.

## ఇబ్బందులు తలెత్తితే పోలీసులను సంప్రదించండి

**చింతలపూడి, న్యూస్‌టుడే:** గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని సీఐ రవీంద్ర అన్నారు. ఈ మేరకు అల్లిపల్లి బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు బుధవారం అవగాహన కల్పించారు. వసతి గృహంలో ఎటువంటి ఇబ్బంది తలెత్తినా వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు.

## వేతనాలు చెల్లించాలని ధర్నా

**చింతలపూడి, న్యూస్‌టుడే:** ఆగస్టు, సెప్టెంబరు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు.

# నూజివీడు

• నూజివీడు • కైకలూరు

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**మండవల్లి, న్యూస్‌టుడే:** పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు మండవల్లిలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు మొక్కలు నాటారు. సమాజాన్ని రక్షించుకునేందుకు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. నాయకులు భాస్కరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే హెచ్ఐవీ కట్టడి



**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** వడాలిలో నాకో వారి సహకారంతో వైల్డ్ వండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వారి ఆధ్వర్యంలో బుధవారం హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. క్లస్టర్ లింక్ వర్కర్ సీహెచ్.నాగలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలు హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉంటేనే ఆ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. ఎంఎస్‌కే కె.విశాలాక్షి, ఏఎన్ఎం జగదీశ్వరి, ఆశా కార్యకర్తలు యాస్మిన్, నల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

నూజివీడు: 99486 40551 | కైకలూరు: 73060 88555
ముసునూరు: 93983 81268 | కలిదిండి: 90594 84862

**కైకలూరు, న్యూస్‌టుడే**

**సమస్య:** కైకలూరు వెలమపేట కాలనీలో ఎంపీపీ పాఠశాల వెంబడి చెత్త కుండీ నిండి రెండు రోజులు గడుస్తున్నా చెత్త సేకరణ చేయడం లేదు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. **- కార్తికేయ, కైకలూరు**

**సమాధానం:** వెంటనే చెత్త తొలగించేలా చర్యలు చేపడతాం. **- వెంకటేశ్వరరావు, పంచాయతీ ఈవో**

**కలిదిండి, న్యూస్‌టుడే**

**సమస్య:** కోట కలిదిండి నుంచి పాతాళ భోగేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే మార్గం అధ్వానంగా ఉంది. బురద రోడ్డుతో అవస్థలు పడుతున్నాం. **- గణేశ్, కలిదిండి**

**సమాధానం :** మురుగు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- ఉదయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, కలిదిండి**

# దారి.. అధ్వానంగా మారి!



అగ్రహారంలో వర్షపు నీటిలో స్థానికుల అవస్థలు





ఆటపాక-వరహాపట్నం రోడ్డు

**కైకలూరు, న్యూస్‌టుడే:** కైకలూరు మండలం ఆటపాక- వరహాపట్నం మార్గంలో భారీ గుంతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోజురోజుకు రోడ్డుపై గుంతల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయి. నూతన రోడ్డు సంగతి అటుంచితే కనీసం భారీ గుంతలైనా పూడ్చేందుకు మహాప్రభో అంటూ సమీప గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. సుమారు నాలుగున్నరేళ్ల నుంచి అధ్వాన రోడ్డులో ప్రయాణాలు సాగిస్తున్నారు. సక్రమంగా సాగక అనేక మంది ప్రమాదాల బారిన పడ్డారు. అయినా అధికారులు పట్టించుకోలేదని వాహనదారులు వాపోతున్నారు.

### వరదలతో పూర్తిగా దెబ్బతిని..

ఇటీవల వచ్చిన వరదల కారణంగా ఈ మార్గం పూర్తిగా ముంపునకు గురైన వరహాపట్నం పంచాయతీ పరిధిలోని అగ్రహారం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇప్పుడు కొంత తెరుకోవడంతో రోడ్డుపై ఉన్న భారీ గుంతలను చూసి వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 12 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే రహదారి 3 కిలో మీటర్ల గతంలో కంటే దారుణంగా దర్శనమిస్తోంది. జయపురం కలిదిండి మండలం ఆరుతెగ్గలపాడు జడ్పీ పాఠశాల, కైకలూరు పాఠశాలలు, కళాశాలలకు సైకిళ్లపై వెళ్తున్న విద్యార్థుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. చిన్నపాటి చినుకులు పడినా.. ఈ గుంతల్లో రోజుల తరబడి నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షాలకు నీరు నిలిచి అధ్వానంగా మారాయి. దీనిపై ఆర్అండ్‌బీ డీఈఈ విజయశ్రీకర్‌ను సంప్రదించగా రోడ్డు మార్గానికి నిధులు మంజూరయ్యాయని, కాంట్రాక్టు విధానం అవగానే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈలోపు భారీ గుంతలకు నీరు తగ్గిన అనంతరం మరమ్మతులు నిర్వహిస్తామన్నారు.

### ప్రధాన మార్గంలో మురుగు

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లి-ఈదర ప్రధాన రహదారిలో మెట్లకోనేరు సమీపంలో రహదారిపై మురుగు పారుతోంది. దాంతో శోభనాపురం, ఈదర, కొత్తఈదర, సీతారామపురం, మైలవరం గ్రామాలకు వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగు నీరు చింది వాహనదారులు, పాదచారులపై పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి ఎంపీడీవో అబ్దుల్ సలాం మాట్లాడుతూ.. రహదారిపై మురుగు పారకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## ముసునూరు ఇన్‌ఛార్జి ఎస్సైగా రాజారెడ్డి



**ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు ఇన్‌ఛార్జి ఎస్సైగా కె.రాజారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన పి.వాసు ఇటీవల బదిలీపై వెళ్లారు. నెల రోజులుగా ఎస్సై పోస్టు ఖాళీగా ఉండటంతో ఉన్నతాధికారులు వీఆర్‌లో ఉన్న రాజారెడ్డిని ఇక్కడికి ఇన్‌ఛార్జి ఎస్సైగా నియమించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానన్నారు.

## ఆలయాల భద్రతపై ముందస్తు చర్యలు

**చాట్రాయి, న్యూస్‌టుడే:** ఆలయాల్లో రథాలు, ఇతర విషయాల్లో ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నూజివీడు గ్రామీణ సీఐ కె.రామకృష్ణ సూచించారు. చనుబండలో అపర భద్రాద్రి కోదండ రామాలయం ఆవరణలో బుధవారం రాత్రి భక్తులతో సమావేశం నిర్వహించారు. ఆలయాల భద్రతపై పలు సూచనలిచ్చారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, ఎస్సై డి.రామకృష్ణ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**కైకలూరు, న్యూస్‌టుడే:** ముదినేపల్లి మండలం చిగురుకోట విద్యుత్తు ఉపకేంద్రంలో అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో గురువారం కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు ఈఈ టి.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు కైకలూరు మండలం వరహాపట్నం, కలిదిండి మండలం కలిదిండి, పోతుమర్రు, కోరుకొల్లు, మూలలంక, కాళ్లపాలెం, ముదినేపల్లి మండలం చిగురుకోట, కొత్తపల్లి, సింగరాయపాలెం విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనునట్లు చెప్పారు.

## కోతకు గురైన రహదారి పరిశీలన

**ముసునూరు, న్యూస్‌టుడే:** చింతలవల్లి-చెక్కపల్లి ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి మధ్యలో మంగళవారం సంధ్యపు వాగు వరద ఉద్ధృతికి తాత్కాలిక రహదారి కోతకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, వీఆర్వో యశోద కోతకు గురైన రహదారిని పరిశీలించారు. మార్గంలో భారీ వాహనాల రాకపోకలు నిలిపేశారు. అనంతరం ఆర్అండ్‌బీ అధికారులకు సమాచారం అందజేశారు.

## బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న డీవైఈవో సేవ్యా

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని క్రీడా మైదానంలో బుధవారం ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలను డీవైఈవో సేవ్యా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ 14, 17 విభాగాలకు చెందిన బాల బాలికలకు విడివిడిగా ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. సీనియర్ పీడీ నాగరాజు, రవీంద్ర, లక్ష్మి, సుకుమార్, సతీష్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శుభశేఖర్

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.శుభశేఖర్ హెచ్చరించారు. ఆగిరిపల్లిలో పెద్ద కొరాయి కూడలిలో బుధవారం రాత్రి ట్రాఫిక్, చోరీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ★ ఆగిరిపల్లి ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఎస్సై కె.శుభశేఖర్ పరిశీలించారు. బాలికలతో మాట్లాడి ఇబ్బందులపై ఆరా తీశారు.

**బాణసంచా నిల్వలపై దాడి.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** బాణసంచాను అక్రమంగా నిల్వ ఉంచిన దుకాణలపై ఎస్సై కె.శుభశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ఆగిరిపల్లిలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.10,500 విలువైన బాణసంచా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఏఎస్సై టి.నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అక్కిరెడ్డిగూడెం: కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు



పెయ్యేరులో..

**ముసునూరు, మండవల్లి, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, న్యూస్‌టుడే:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సర్పంచి పులిబల్ల లక్ష్మీసత్యనారాయణ అన్నారు. బుధవారం అక్కిరెడ్డిగూడెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బర్మా శ్రీనివాసరావు, మానురాజు సురేశ్, శ్రీనివాసరావు, శోభనం, సత్యనారాయణ, శంకరరావు పాల్గొన్నారు. ★ నాయకుడు గురుగుబెల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండవల్లి మండలం పుట్లచెరువులో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. నాయకులు కూన వెంకటేశ్వరరావు, బొడ్డుపల్లి అప్పారావు, పూజారి రమణ, గెడ్డం రాము వీఆర్వో రేగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ★ తెదేపా మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ రహీం, తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పోలవలరపు లక్ష్మీరాణి ఆధ్వర్యంలో కైకలూరు 11వ బూత్‌లో కరపత్రాలు అందజేశారు. వీరాబత్తిన సుధ, గ్రామ సచివాలయ సిబ్బంది పవన్, రవిశంకర్, నరేశ్, శరణ్య పాల్గొన్నారు. ★ కూటమి నాయకులు తోట వీరాంజనేయులు, మొగనాటి రాజేశ్ కోరుకొల్లులో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ★ భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ ఆధ్వర్యంలో పెయ్యేరు ఆటోనగర్‌లో పర్యటించారు. కూటమి నాయకులు అడుసుమిల్లి సాయి, జొన్నలగడ్డ వీరాస్వామి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి



మాట్లాడుతున్న హబీబ్ బాషా

**కైకలూరు, న్యూస్‌టుడే:** సాగు పెట్టుబడి తక్కువగా ఉండే వ్యవసాయ పద్ధతులను అనుసరించేలా రైతులకు సహకరిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోపవరంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు ఈ-పంట యాప్‌లో పంటల వివరాలు తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ ఏడీలు ఆర్.గంగాధరరావు, ముస్తఫాఖాన్ పాల్గొన్నారు.

## ఎంపిక సక్రమంగా చేయండి

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** ముదినేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 26 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే మండల స్థాయి ఆటల పోటీల ఎంపికలు సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో-2 కె.నరేశ్‌కుమార్ సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా ఎంపికలు నిర్వహించాలని తెలిపారు. పోటీల మండల ఇన్‌ఛార్జి పీడీ కోడే రోజా, వడాలి, గురజ పీడీలు భాస్కర్, రత్నారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు.. రాకపోకలకు ఆటంకం



**ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు మండలంలో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి ముసునూరు-నూజివీడు మార్గంలో సింహాద్రిపురం వద్ద రాములేరు వాగు ఉద్ధృతంగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోయాయి. ముసునూరు నుంచి వలసపల్లి వైపు వెళ్లే సంధ్యపు వాగు, కాళంగి వాగు, గోగులంపాడు, అక్కిరెడ్డిగూడెం రహదారి మధ్యలో రాళ్ల వాగు, లోపూడిలో ఉప్పాగు రహదారిపై పొంగి పొర్లడంతో రాకపోకలు స్తంభించాయి. ముసునూరులో పత్తి తదితర పంటలు నీట మునిగాయి.



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

## క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థి దశలో సమయపాలన, క్రమశిక్షణ అలవరుచుకుంటే అత్యున్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎం పవర్ స్కిల్స్ అకాడమీ నిర్వహకులు అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు కళాశాల ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్వహకులు మాట్లాడుతూ.. విద్యార్థి దశకు క్రమశిక్షణ తొలిమెట్టు కావాలన్నారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వహకులు ప్రదీప్, వెంకట్, నందకిశోర్, కన్వీనర్ నాగార్జున దేవి తదితరులు పాల్గొన్నారు.

## 'మన ఇల్లు - మన గౌరవం' విజయవంతం చేద్దాం

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 28న నిర్వహించనున్న మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దారు పీఎస్వీ ప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో అబ్దుల్ సలాం, గృహనిర్మాణ సంస్థ ఏఈ అలీముల్లా, ఏవో పి.చెన్నారావు, హెచ్‌వో జ్యోతి ప్రియాంక పాల్గొన్నారు.

**ముసునూరు, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో సుందరి అన్నారు. బుధవారం ముసునూరు ఎంపీడీవో కార్యాలయంలో మన ఇల్లు-మన గౌరవం, ఇది మంచి ప్రభుత్వం, స్వచ్ఛతా హీ సేవా, స్వర్ణాంధ్ర-2047 వంటి కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, ఎంఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పెదపాలపర్రు సొసైటీ కార్యదర్శిపై రైతుల ఆగ్రహం



కార్యదర్శిపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** పెదపాలపర్రు వ్యవసాయ సహకార పరస్పర పరపతి సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం పర్సన్ ఇన్‌ఛార్జి బీవీ.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో సంఘ కార్యదర్శి నాగమల్లీశ్వరి వైఖరిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ రుణాలు అందించడం లేదని, అలాగే రుణాలు తీర్చినా తాకట్టు పెట్టిన భూమి పత్రాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘ సభ్యులు చనిపోతే ఇవ్వాల్సిన మట్టి ఖర్చులు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పర్సన్ ఇన్‌ఛార్జి తెలిపారు. సర్పంచి గంటా రాకేశ్, నాయకులు చల్లగుళ్ల ఆదిత్యచౌదరి, జి.వెంకటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.



గురజలో పూజలు చేస్తున్న జనసైనికులు

## 'కల్తీ నెయ్యి వాడటం దారుణం'

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తిరుమల లడ్డూ కల్తీపై చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ముదినేపల్లి జనసైనికులు బుధవారం గురజ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి వేల్పూరి నానాజీ ఆధ్వర్యంలో శివాలయం ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు చేశారు.

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడటం దారుణమని నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం అడ్డ రోడ్డు కూడలిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జనసేన ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. ముక్కు మహేశ్, సముద్రాల రవి, సువర్ణబాబు, రమేశ్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఒకరికి గాయాలు

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** నూజివీడు పట్టణంలోని రామయ్యమ్మరావుపేట వద్ద బుధవారం కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన పల్లిపాము చరణ్ తుక్కులూరు నుంచి నూజివీడు వస్తున్నారు. పట్టణంలోని రామయామ్మరావుపేట వద్ద ఎదురుగా వస్తున్న కారు ఆయనను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రుడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి, అనంతరం విజయవాడ తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

**చాట్రాయి, న్యూస్‌టుడే:** సమగ్ర సస్య రక్షణ చర్యలతోనే అధిక దిగుబడులను సాధించవచ్చని, రైతులు గమనించి సాగులో చీడపీడల నివారణపై సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి బండారు శివశంకర్ అన్నారు. చాట్రాయి వ్యవసాయ కార్యాలయంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించి రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. తెదేపా జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, అత్తునూరి శ్రీనివాసరావు, రాయవరపు పుల్లారావు, కంపసాటి చెన్నారావు, తుమ్మల జగన్, వేణుగోపాలరెడ్డి రైతులు పాల్గొన్నారు.

**మండవల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని అయ్యవారిరుద్రవరం, పెరికెగూడెం గ్రామాల్లో గురువారం ఏవో జరీనా పొలాల్ని పరిశీలించారు. పెరికెగూడెం ఎంపీటీసీ సభ్యురాలు కాంతమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కాంతమ్మ, నాగవిజయ, సర్పంచి లక్ష్మి, తెదేపా నాయకులు రాంబాబు పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.



అయ్యవారిరుద్రవరంలో..

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. బుధవారం పెయ్యేరు శివారు అప్పారావుపేట, దాకరంలో పశు వైద్యాధికారి క్రాంతికుమార్, సర్పంచి జాస్తి రాఘవేంద్రరావు, హనుమార పేర్నీడు, దుక్కిపాటి శేషబాబు పర్యటించారు.

## 27, 28న మండల స్థాయి ఆటల పోటీలు

**మండవల్లి, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లోని ప్రతిభను బయట పెట్టేందుకు ఈనెల 27, 28 తేదీల్లో మండల స్థాయి ఆటల పోటీలు మండవల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆటల పోటీల మండల ఇన్‌ఛార్జి వేణుబాబు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్‌తో పాటు మరికొన్ని పోటీలు ఉంటాయన్నారు.

## చదువు మానేసిన వారిని గుర్తించండి



హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

**చాట్రాయి, న్యూస్‌టుడే:** ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంగా మధ్యలో చదువు మానేసిన వారి కోసం అమలు చేసే సార్వత్రిక విద్యా వరంలా ఉంటుందని, దానిని అందరూ సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తీసుకురావాలని ఎంఈవో వీఎస్వీ.బ్రహ్మాచారి అన్నారు. చాట్రాయి ఉన్నత పాఠశాలలో సార్వత్రిక విద్యపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం కృష్ణయ్య, సూపర్‌వైజర్ గాయత్రి పాల్గొన్నారు.

## కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నం

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** గడ్డి మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన ఘటన ముసునూరు మండలం సూరేపల్లిలో బుధవారం జరిగింది. బంధువుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కె.శ్రీనుకు రెండేళ్ల కిందట వివాహమైంది. అతనికి తరచూ కడుపు నొప్పి వస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం భరించలేని విధంగా కడుపు నొప్పి రావడంతో ఇంటి వద్ద ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన బంధువులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

**చాట్రాయి, న్యూస్‌టుడే:** ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు నూజివీడు గ్రామీణ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన కోట రవి ఇంటి వద్ద పలు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి తనిఖీ చేశామన్నారు. అక్కడ 12 ద్విచక్ర వాహనాలు, ఒక మేకపోతును గుర్తించామన్నారు. దానిపై రవిని విచారించగా.. ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో చోరీలు చేసినట్లు తెలిసిందన్నారు. తిరువూరు, ఏలూరు, చాట్రాయి పరిధిలోని వాహనాలుగా వాటిని గుర్తించామన్నారు. అనంతరం నిందితుడిని పట్టుకోవడంతో ప్రతిభ చూపిన ఎస్సై డి.రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ విజయభాస్కర్, కానిస్టేబుళ్లు వీటి.విష్ణుకుమార్, కె.గిరిబాబులను అభినందిస్తూ పురస్కారాలను సీఐ అందించారు.

## తండ్రి మృతదేహాన్ని గుర్తించిన కుమార్తె

**కైకలూరు, న్యూస్‌టుడే:** ఏలూరు జిల్లా కైకలూరు మండలం వింజరం పంట కాలువలో ఈనెల 21న గుర్తుతెలియని మృతదేహం లభ్యమవడంతో పట్టణ పోలీసులు కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దినపత్రికల్లో వార్తలను చూసిన తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన మృతుడి కుమార్తె జ్యోతిర్మయి పోలీసులను ఆశ్రయించారు. మృతదేహాన్ని చూసి తన తండ్రి నక్కిన నాగభూషణం(47)గా గుర్తించినట్లు సీఐ పి.కృష్ణ తెలిపారు. ఈనెల ఒకటో తేదీన నాగభూషణం తెలంగాణ రాష్ట్రంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. వరదలు వచ్చిన సమయంలో స్వగ్రామానికి తిరిగి వస్తుండగా తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్‌లోని రాళ్ల వాగు దాటుతుండగా.. నీటి ప్రవాహానికి వాగులో కొట్టుకుపోయారు. ఈనేపథ్యంలో రాళ్ల వాగు నుంచి మున్నేరు వాగు, కృష్ణానది మీదుగా వింజరం లాకుల వద్దకు మృతదేహం కొట్టుకొచ్చింది. మృతుడి కుమార్తె ఇచ్చిన ఆధారాలను సేకరించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

## దీన్ దయాళ్ సేవలు చిరస్మరణీయం



నూజివీడు: చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



కైకలూరులో..

**నూజివీడు పట్టణం, ముసునూరు, చాట్రాయి, న్యూస్‌టుడే:** నూజివీడు పట్టణం పెద్ద గాంధీ బొమ్మ కూడలి వద్ద పండిట్ దీన్ దయాళ్ జయంతి వేడుకలను బుధవారం భాజపా నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భాజపా పట్టణ అధ్యక్షుడు బోను అప్పారావు పాల్గొన్నారు. ★ ముసునూరులోని భాజపా కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ★ సూరంపాలెంలో భాజపా మండలాధ్యక్షుడు ఒబిళ్లనేని రాజా, నాయకులు బుర్రె శ్రీకర్, బజ్జూరి గోపి, శెట్టిపల్లి రవి నిర్వహించారు.

**కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే:** దేశ పరిరక్షణకు పాటు పడిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ అని భాజపా నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు అన్నారు. కైకలూరులో పార్టీ మండలాధ్యక్షుడు కట్టా వీరరాఘవులు ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ★ లోకుమూడి, మండవల్లి గ్రామాల్లో భాజపా నాయకులు పార్టీ మండలాధ్యక్షుడు సమయం ఏసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఆందోళన




విద్యార్థులు, నాయకుల ప్రదర్శన

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** నూజివీడులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానిక చిన్న గాంధీ బొమ్మ కూడలి వద్ద ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం ఆందోళన చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి అఖిల్ మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి విద్యార్థులను మోసం చేసిందన్నారు. తక్షణమే పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** నూజివీడు ట్రిపుల్ ఐటీ ఎన్‌సీసీ విద్యార్థులు దిల్లీలో జరిగిన తల్ సైనిక్ ఆల్ ఇండియా క్యాంప్ 2024లో అద్భుత ప్రదర్శనలిచ్చి ప్రశంసలు పొందారు. 17వ ఆంధ్ర బెటాలియన్ నుంచి భాస్కర్, పూజిత ఈనెల 2 నుంచి 12 వరకు జరిగిన నాలుగో ఆంధ్ర బాలికల బెటాలియన్ నుంచి పూజిత జడ్జిగ్ డిస్టెన్స్ అండ్ ఫిల్డ్ సిగ్నల్స్ విభాగంలో చేసిన ప్రదర్శనలపై అందరి ప్రశంసలు పొందినట్లు ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ సీహెచ్ నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. విద్యార్థులను ట్రిపుల్ ఐటీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఏవో లక్ష్మణరావు అభినందించారు.